# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 10 డిసెంబర్ 2025 | ■ 13 పేజీలు





రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంచిర్యాల ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, మెప్మా మహిళలు, ఆశా వర్కర్లు, జిల్లా అధికారులు పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాలుచల్లారు. ఈ సందర్భంగా జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు.

## కొలువుదీరిన తెలంగాణ తల్లి

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా తొలి విడుతలో ఎన్నికలు నిర్వహించే గ్రామాల్లో ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. మరోవైపు మూడో విడుత ఎన్నికలు నిర్వహించే గ్రామాల్లో నామినేషన్ల ఉపసంహరణ కూడా పూర్తయ్యింది. దీంతో గ్రామాల్లో ఎలక్షన్ల హీట్ పెరిగింది. తొలి విడుత ప్రచారం ముగిసిన నేపథ్యంలో అన్ని పార్టీల నాయకులు తమ మద్దతుదారులు పోటీ చేసే రెండో విడుత ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. పోటీలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం గురువారం తేలిపోనుంది. మొదటి విడుతకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 506 గ్రామాలు, 4,222 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేశారు. ఇందులో కొన్ని స్థానాలు ఏకగ్రీవం కావడం, మరికొన్ని స్థానాల్లో అసలు నామినేషన్లు పడకపోవడంతో వాటిని మినహాయించి మిగిలిన స్థానాలకు రేపు(డిసెంబర్ 11న) ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ 24 గంటలే వారికి కీలకం కానున్నాయి. ఇప్పటిదాకా బాగుందన్న వారి భవిష్యత్తు తలకిందులు కావచ్చు. అంచనాలు లేకుండానే అనామకులు తెరపైకి దూసుకురావచ్చు. చివరి క్షణంలో ఏదైనా జరగొచ్చు. గురువారం 11న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కించి, సాయంత్రం వరకు ఫలితాలు వెల్లడిస్తారు.

# తొలి విడతకు తెర..
# పంచింగ్ స్టార్ట్




- ■ వారం రోజులుగా హోరాహోరీగా ప్రచారం
- ■ ముగిసిన గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల ప్రచారం
- ■ ఉమ్మడి జిల్లాలో పూర్తయిన మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ గడువు
- ■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 506 గ్రామాలు, 4,222 వార్డుల్లో ఎన్నికలు
- ■ సర్వం సిద్ధం చేసిన అధికారులు..
- ■ నేడు మండల కేంద్రాల్లో సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేయనున్న అధికారులు
- ■ ప్రలోభాలకు తెరలేపిన అభ్యర్థులు
- ■ రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

## గోదావరి పరిక్రమన యాత్ర



13

- ■ బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో 400 మంది సాధువుల ప్రత్యేక పూజలు
- ■ గోదావరిలో సాధువుల పుణ్యస్నానాలు..
- ■ నిర్మల్‌లో బైక్ ర్యాలీతో భారీ శోభయాత్ర

## 'విశ్వ' పఠాన్ జమీల్ ఖాన్



13

- ■ టోరంటోలో మెరిసిన మందమర్రి ముద్దుబిడ్డ
- ■ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం

## ఒట్టేసి చెబుతున్నాం.. ఓటెయ్యం..!

- ■ మా గ్రామాలను పట్టించుకోరా..?
- ■ ఓట్ల సమయంలోనే గుర్తొస్తామా..
- ■ అభివృద్ధి జరగలేదని గ్రామ శివారులో నిరసన
- ■ గోపాల్‌పూర్, గోపాల్‌పూర్‌గూడ గ్రామస్తులు

ప్రభాత సమాచారం, ఇంద్రవెల్లి

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల గోపాల్‌పూర్, గోపాల్‌పూర్ గూడ గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని, సర్పంచ్ ఎన్నికలకు దూరంగా ఉంటామని నిర్ణయించారు. మంగళవారం గ్రామానికి కొద్దిదూరంలో ఉన్న వాగు వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లా డుతూ.. ఇప్పటి వరకు గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవ డంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల ఎన్నికలతోపాటు ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు తమ గ్రామానికి వచ్చి అభివృద్ధి చేస్తామని నమ్మించి మోసం చేసి మా ఓట్లతో గెలిచిన తరువాత తమ గ్రామానికి ఎవరు కూడా రాకుండా తమను పట్టించుకోవడం లేదన్నారు.



10

## ఎన్నికల నిర్వహణలో
## భద్రతా సమస్యలు రావొద్దు

11

- ■ ఎన్నికల నిర్వహణలో భద్రతా సమస్యలు రావొద్దు
- ■ ఎన్నికల వేళ.. అభ్యర్థులకు హెచ్చరిక!
- ■ అభ్యర్థులు ప్రజలకు డబ్బులిచ్చినా, బెదిరించినా నేరమే
- ■ జైలు శిక్షతో పాటు జరిమానాలు తప్పవు




## అండగా నేనుంటా

- ■ గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- ■ కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి గెలుపుతోనే అభివృద్ధి
- ■ నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్..

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎలాంటి సమస్యలు కలగకూడదు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- మొదటి విడత ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నాం
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు- 2025 లో ఈ నెల 11వ తేదీన జరగనున్న మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఎన్నికల సంఘం కమిషన్ సభ్యులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సాధారణ, వ్యయ పరిశీలకులు, జిల్లా పంచాయతీ అధికారులతో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు తీసుకోవలసిన చర్యలు, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఓటర్ల ప్రభావిత అంశాలను అరికట్టడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడతలో రాష్ట్రంలోని 3 వేల 834 గ్రామపంచాయతీ సర్పంచ్, 27 వేల 628 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఇందు కొరకు 37 వేల 562 పోలింగ్ కేంద్రాలలో 56 లక్షల 19 వేల 430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. సర్పంచ్ స్థానానికి 12 వేల 960 మంది, వార్డు సభ్యుల స్థానానికి 65 వేల 455 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని తెలిపారు. పంచాయతీ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సమయాలలో జాగ్రత్తలు వహించాలని, ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత ఎన్నికలలో 81 గ్రామపంచాయతీ సర్పంచ్, 514 వార్డు సభ్యుల స్థానాలకు నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. స్టేజ్-2 ఆర్‌ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, పోలింగ్, ఇతర పోలింగ్ అధికారులకు శిక్షణ అందించి పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని, ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేయడం జరిగిందని, పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక కల్పించడం జరిగిందని తెలిపారు. ఆయా మండల కేంద్రాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో కౌంటర్లు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు, పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక సజావుగా జరిగేలా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు మనోహర్ మాట్లాడుతూ మొదటి విడత ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యయ పరిశీలకులు రాజేశ్వర్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు ఎన్నికల అధికారి, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి గణపతి, నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమావళి పాటించాలి..**

తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా, ఎన్నికల ప్రచారంపై అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసిందని, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలని, ప్రచార సమయం ముగియడంతో ఆ తర్వాత బహిరంగ ప్రచారానికి అనుమతి ఉండదని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రచార సమయం ముగియడంతో నిషేధాజ్ఞల అమలులోకి వచ్చినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఇప్పటికే నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధమన్నారు.

# ముగిసిన మొదటి విడత ఎన్నికల ప్రచారం

- ఆరు మండలాల్లో నిషేధాజ్ఞలు అమలు
- ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమావళి పాటించాలి
- మద్యం దుకాణాలు మూసివేత
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
11న జరగనున్న తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారంపై అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. తొలి విడత ఎన్నికలు జరిగే ఆరు మండలాలు దస్తురాబాద్, ఖానాపూర్, పెంబి, కడెం, లక్ష్మణచాంద, మామడల పరిధిలో మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగిసింది. గడువు ముగిసిన తర్వాత బహిరంగ ప్రచారానికి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. అమల్లోకి నిషేధాజ్ఞలు.. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఆరు మండలాల్లో నిషేధాజ్ఞలు అమల్లోకి వచ్చినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అదే విధంగా మంగళవారం సాయంత్రం 5 గంటల నుండి సెక్షన్ 163 అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధమన్నారు. మద్యం దుకాణాలు బంద్.. ఎన్నికల ప్రచారం ముగియడంతో పోలింగ్, ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఈ ప్రాంతాలలో అన్ని మద్యం దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలను 11వ తేదీ, గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం, అదే రోజు సాయంత్రం ఓట్లను లెక్కించి, ఫలితాల వెల్లడి జరుగుతుందన్నారు.



## ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- నార్నూర్, గాదిగూడ మండలాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**నార్నూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం నార్నూర్ మండలంలో పరిశీలించారు. తడిహత్నూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి, సిబ్బంది నియోజకవర్గాల వారీగా చేపట్టిన ఏర్పాట్లు, పోలింగ్ మెటీరియల్ అందుబాటు, భద్రతా చర్యలు, అమలు చేస్తున్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సహా పలు అంశాలను ఆరా తీశారు. తరువాత నార్నూర్ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంను కూడా కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ పంపిణీ విధానం, రవాణా సదుపాయాలు, క్యూలైన్ నిర్వహణ, సహాయక డెస్క్ వ్యవస్థ వంటి అంశాలు సమగ్రంగా పరిశీలించారు. పోలింగ్ రోజు ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా నిర్వహించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ప్రజాస్వామ్య ప్రక్రియను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎంపీడీవో, తహసిల్దార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విరిగిన విద్యుత్ స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం

**బోథ్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రానికి సమీపంలో ఉన్న రాఘవేంద్ర జిన్నింగ్ ఫ్యాక్టరీ ప్రక్కన ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన డంతో స్తంభం విరిగిపోయి ప్రమాదకరంగా మారిందన్నారు. ఇక్కడి నుండి విద్యార్థులు వెళ్తున్నారని విద్యుత్ అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




## కొత్త డీసీసీలకు అందరిని కలుపుకొని పని చేయాలి

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**




**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
బాధ్యతలు స్వీకరించిన వెంటనే డీసీసీలు జిల్లా సీనియర్ నేతలు, ముఖ్య నాయకులను కలుపుకుని సమన్వయంతో పని చేయాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హితవు పలికారు. కొత్త డీసీసీ అధ్యక్షులు ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నిర్ణయించిన ఆరు నెలల పనితీరు డెడ్‌లైన్ మరువకూడదని, ఆ గడువులోపు స్పష్టమైన పురోగతిని చూపించాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, సమన్వయంతో పని చేస్తేనే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలు ఖాయం అవుతాయని స్పష్టం చేశారు. ఇవాళ హైదరాబాద్‌లో డీసీసీ అధ్యక్షులు, ఫ్రంటల్ మరియు అనుబంధ సంఘాల చైర్మన్‌లతో టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన డీసీసీ అధ్యక్షులకు మహేష్ గౌడ్ స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

**ఢిల్లీ ధర్నా విజయవంతం చేయండి...**

'ఓట్ చోర్' సంతకాల సేకరణ కార్య క్రమాన్ని వేగవంతం చేయాలని, 14వ తేదీన ఢిల్లీలో జరగనున్న 'ఓట్ చోర్ మహా ధర్నా' విజయవంతం చేయాలని సూచించారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ బలపర్చే అభ్యర్థుల గెలుపునకు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

## జన్నారంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత సోనియా గాంధీది అని అన్నారు. ప్రతీ పేదోడికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. 4 కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత సోనియా గాంధీ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇసాక్, మోహన్ రెడ్డి, మాజీ జెడ్పిటీసీ ఎర్ర చంద్రశేఖర్, సర్పంచ్ అభ్యర్థి జక్కు భూమేష్, పట్టణ అధ్యక్షులు రమేష్, పంకజ, తదితరులు పాల్గొన్నారు.



## మెనూ ప్రకారం నాణ్యమైన
# భోజనం అందించాలి

■ విద్యార్థుల భద్రత, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి
■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**నార్నూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం నార్నూర్, గాదిగూడ మండలాల్లో పలు అభివృద్ధి-పర్యవేక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. విద్య, సంక్షేమం, ఎన్నికల ఏర్పాట్లు వంటి విభాగాల్లో జరుగుతున్న పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. నార్నూర్ మండల కేంద్రంలోని ఎంపీపీస్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల పఠన-రాత నైపుణ్యాలను స్వయంగా పరీక్షించారు. పిల్లలతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని అంచనా వేశారు. బోధన నాణ్యతను ఇంకా మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల హాజరు, బోధన రికార్డులు, తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం గ్రామపంచాయతీ ఎన్నికల తొలి విడత నేపథ్యంలో గాదిగూడ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటైన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది కూర్చోబెట్టే విధానం, ఓటింగ్ సామగ్రి పంపిణీ, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను వివరంగా పరిశీలించి అధికారుల చర్యలను సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. తర్వాత కలెక్టర్ గాదిగూడ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ స్టోర్ గది, వంటశాల, భోజనశాల పరిశుభ్రత, ఆహార నాణ్యతను సమగ్రంగా పరిశీలించారు. విద్యార్థులతో భోజనం చేస్తూ వారి అవసరాలు, సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. విద్యార్థుల భద్రత, పరిశుభ్రత, నివాస సదుపాయాల విషయంలో అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలని ఈ సందర్భంగా సిబ్బంది కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాలలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎంపీడీవో, తహసిల్దార్, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





## సర్పంచ్ అభ్యర్థులకు
# అవగాహన సదస్సు

**సాత్నాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా సాత్నాల మండల పరిధిలోని గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేపడుతున్నట్లు సాత్నాల ఎంపీడీఓ వెంకట్‌రాజు, తహశీల్దార్ జాదవ్ రామారావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండలంలోని కాన్స మేడిగూడ రైతు వేదికలో మండల పరిధిలోని సర్పంచ్, వార్డ్ అభ్యర్థులకు ఎన్నికల వ్యయం పై మండల సహాయ వ్యయ పరిశీలకురాలు (ఏఈఓ) కవితచే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, తహశీల్దార్‌లు అభ్యర్థులకు కీలక సూచనలు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం విధించిన నిబంధనలు పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు సహకరించాలని కోరారు. అనంతరం, అభ్యర్థులు చేసే ఖర్చు వివరాలను అభ్యర్థులకు కేటాయించిన రిజిస్టర్‌లో పార్ట్-1 నుండి పార్ట్-3 వరకు ఎలా పొందుపరచాలో అవగాహన కల్పించడంతో పాటు, వారి సందేహాలను ఏఈఓ కవిత నివృత్తి చేశారు.

# ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్, కార్యక్రమానికి కెరమెరి ఎస్సై నాయిని మధుకర్ ఎంపిపిఎస్ సుల్తాన్ గుడ, ఎంపిపిఎస్ బోరిలాల్ గూడా, శంకర్ గుడ, అందుగూడ, ఎంపిపిఎస్ కరంజివాడ ప్రభుత్వ పాఠశాలల 150 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్, షార్ప్నర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలుల హక్కుల గురించి, మానవ హక్కుల గురించి, ప్రాథమిక హక్కుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల



కమిటీ కేరమేరి మండల చైర్మన్ జాదవ్ రమేష్, వైస్ చైర్మన్ బోడికే రవి, ప్రభుత్వ ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ దీక్షా స్ఫూర్తిని భావితరాలకు అందించాలి




**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక ఘట్టాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విజయ్ దివస్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా 2009లో 11 రోజులపాటు ఆమరణ దీక్ష చేపట్టి, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వెలువడేలా చేసిన తెలంగాణ ఉద్యమ సారథి, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు త్యాగాన్ని నాయకులు గుర్తు చేశారు. కేసీఆర్ దీక్ష, ఎందరో ప్రాణ త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ ప్రత్యేక రాష్ట్రాన్ని పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచారన్నారు. విజయ్ దివస్ సందర్భంగా పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్ , రాష్ట్ర నాయకురాలు మర్సకోల సరస్వతి, బుర్స పోచన్న పూలమాలలు వేశారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్, నిసర్, వెంకన్న, నారాయణ, అశోక్, జావెద్, సాజిద్, అన్సార్,రవి, సాలాం, చందు తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి పట్టణంలో
# వ్యాపారుల బంద్ సక్సెస్

### రోడ్డు విస్తరణకు వ్యతిరేకంగా వ్యాపారుల నిరసన

**బెల్లంపల్లి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణ వ్యాపారస్తుల బంద్‌కు అనూహ్య స్పందన వచ్చింది. బజార్ ఏరియాలో ఏరియాలో మున్సిపల్ అధికారులు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను ఆపివేయాలంటూ మంగళవారం వ్యాపారస్తులు బంద్ పాటించారు. రోడ్డు విస్తరణతో తమ దుకాణాలకు నష్టం జరిగి జీవనోపాధినీ కోల్పోతామని వాపోయారు. బంద్‌ను పురస్కరించుకొని వ్యాపారస్తులు పుర విధుల్లోపెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. వ్యాపారస్తుల బంద్ తో బజార్ ఏరియా నిర్మానుష్యంగ మారింది.

**రోడ్డు విస్తరణ పనులు ఆపాలి..**
బెల్లంపల్లి వ్యాపారస్తులకు నష్టం చేస్తున్న బజారు ఏరియా రోడ్డు వెడల్పు పనులను నిలిపివేయాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్ చేశారు. వ్యాపారస్తులు చేపట్టిన బంద్ కు ఆయన మద్దతు పలికారు. వ్యాపారాల ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ముందు చూపు లేకుండా ఎమ్మెల్యే గడ్డం వినోద్ బెల్లంపల్లిలో రోడ్డు విస్తరణ పేరట వ్యాపారస్తులకు తీరని నష్టం చేస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు విస్తరణతో వ్యాపారస్తులకు జరిగే నష్టాన్ని గమనలోకి తీసుకోకుండా రోడ్డు విస్తరణను చేపట్టడంపై మండిపడ్డారు. ఎమ్మెల్యే పట్టణాభివృద్ధి, పేరుతో అధికారులు వ్యాపారస్తులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా రోడ్డు విస్తరణను కుదించాలని డిమాండ్ చేశారు. కాంటా చౌరస్తా వరకే రోడ్డు విస్తరణ పనులను పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.



# అక్రిడిటేషన్‌కు సంబంధం లేకుండా ఎన్నికల పాసులు జారీ చేయాలి

### టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్

**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
వార్త సేకరణ కోసం పంచాయతీ ఎన్నికల్లో అక్రిడేషన్ కార్డుకు సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్టులకు పాసులు జారీ చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ కలెక్టరేట్ కార్యాలయ ఏఓ కిరణ్‌ను కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో చాలామంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌కార్డులు లేవన్నారు. దీంతో చాలామంది వర్కింగ్ జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటారని జిల్లా



కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అక్రిడిటేషన్ కార్డులు లేని వర్కింగ్ జర్నలిస్టులకు పంచాయతీ ఎన్నికల పాసులు జారీ చేయాలని కోరారు. ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల వార్తలను కవరేజీ కోసం అక్రిడిటేషన్ కార్డులు లేని జర్నలిస్టులకు కూడా పాసులు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీయూ డబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రకాష్ గౌడ్, ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్ రావు, జర్నలిస్టులు సురేష్, రాధాకృష్ణ చారి, రాంబాబు, రవీందర్, ఎన్ మినేష్, అవినాష్, మోయిన్, సీహెచ్ చేతన్, రాందాస్, ముబశిర్, మిలిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జాతీయ ఆరోగ్య మిషన్ లో పని చేస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ అనితకు ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు వినతిపత్రం అందజేసిన అనంతరం యూనియన్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనబోయిన బాపు యాదవ్ మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, కాంటిజెంట్ వర్కర్లకు జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ. 15,600 చెల్లించాలని, డాటా



ఎంట్రీ ఆపరేటర్లకు రూ. 19,500 జీవో నెంబర్ 1195 ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం కళావతి మాట్లాడుతూ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డ్స్, హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 10 లక్షల చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలనెలా జీతాలు అందకపోవడంతో ఇంటి కిరాయిలు, పిల్లల ఫీజులు, కుటుంబ పోషణ కష్టమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఏఐటియుసి ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిరవధిక సమ్మెకు వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్సీడీ అరుణ్ శ్రీ, డీపీఓ శాంతి, ఎంఎల్‌హెచ్‌పీ తేజ, స్టాఫ్ నర్స్ రజిత, ఏఎన్ఎంలు రాజా, లక్ష్మీ, ఉమాదేవి, డాటా ఎంట్రీ ఆపరేటర్ శివ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల సామగ్రి పంపిణీ
# కేంద్రం పరిశీలన

**ఖానాపూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ఖానాపూర్ నియోజకవర్గంలో అన్ని మండలాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన సామాగ్రి పంపిణీ కోసం సమస్త ఏర్పాట్లు చేసి పంపిణీకి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు పంపిణీ కేంద్రాలను సమగ్రంగా పరిశీలించి పకడ్బందీగా స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధం చేసి నట్లు తెలిపారు. కాగా మంగళవారం ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేశారు. పదవ తేదీ ఉదయం నుంచి ఈ సామాగ్రిని పోలింగ్ అధికారులకు అందజేస్తామని ఎంపీడీవో రమాకాంత్ తెలిపారు. కేంద్రాల్లో పోలీసులు సిఐ అజయ్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వారితో పాటు ఎస్సై రాహుల్ గైక్వాడ్, ఎంపిఓసిహెచ్ రత్నాకర్ రావు, ఎంఈఓ సంధ్య, తదితరులు ఉన్నారు.

## తెలంగాణ తల్లి
# విగ్రహానికి వినతి పత్రం



**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
దివ్యాంగులు తమ సమస్యలు పరిష్కారం చేయాలని కలెక్టర్ ఆఫీస్ లోని తెలంగాణ తల్లి విగ్రహానికి దివ్యాంగుల సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం అందించారు. విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా వారి బాధలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి కోసం సంఘ భవనం కావాలని, అంత్యోదయ కార్డులు జారీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన ఉచిత బస్ ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, 6 వేలు పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఇందులో సట్టి సాయన్న, ఇసాక్ అలీ, భగవాన్, సత్యనారాయణ, వెంకటేష్, భూమేష్ తదితరులు ఉన్నారు.

# టీఎన్జీవో సంఘం సభ్యత్వ నమోదు

**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
టీఎన్జీవో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ ఆధ్వర్యంలో సభ్యత్వాన్ని ఉద్యోగుల నుంచి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎన్జీవో నాయకులు మోహన్ రెడ్డి చక్కెర శ్రీనివాస్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# పంచాయతీ ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ కేంద్రాల అలాట్మెంట్‌కు చివరి విడత ర్యాండమైజేషన్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా. పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్, ఎన్నికల సాధారణ పరిశీలకులు టి. వెంకన్న, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, డీపీఓ రమేష్, డిడబ్ల్యూఓ మిల్కా, డిఎల్పీఓ ఫణీందర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలి



## రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
శాంతియుతంగా ఎన్నికలను నిర్వహించుకోవాలని రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మంగళవారం కమిషనరేట్ లో ఎన్నికల నిర్వహణ పై సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్, కాల్వ శ్రీరాంపూర్, కామన్ పూర్, రామగిరి, మంథని, ముత్తారం, తోపాటు మంచిర్యాల జోన్ పరిధిలోని దండేపల్లి, జన్నారం, లక్షట్ పేట మండలాలలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సెక్షన్ 163 బి.ఎన్.ఎస్. ఎస్ యాక్ట్ అమల్లో ఉంటుందని అన్నారు. ఆంక్షలు సమయంలో ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. నలుగురికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధం అన్నారు. ఎన్నికలలో ఉద్రిక్తత, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారి తీసేందుకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, ఫారెస్ట్ అధికారులు, కేంద్ర బలగాలు, హోంగార్డులు, ఎస్. పి.ఓ లకు మాత్రం ఈ నిషేధాలు వర్తించమన్నారు. ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు, చట్టపరమైన కార్యక్రమాలు అనుమతి లేకుండా చేపట్టరాదని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు ఒక కిలోమీటర్ పరిధిలో ఎన్నికల నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద తాత్కాలిక నిర్మాణాలు షామియానాలు పందిళ్లు ఏర్పాటు చేయడానికి కూడా అనుమతి తప్పనిసరి అన్నారు. మైకులు లౌడ్ స్పీకర్ల ద్వారా పాటలు ప్రసారం చేయడం సభలు నిర్వహించడం చేయకూడదన్నారు. ఒక వర్గం మీద మరొక వర్గం రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలను సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి



**తాండూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ఈనెల 14న జరుగనున్న పంచాయతీ పోలింగ్ సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తాండూర్ మండల ఎన్నికల సహాయ అధికారి, ఎంపీడీవో శ్రీనివాస్ సంబంధిత అధికారులకు సూచించారు. పోలింగ్ ప్రక్రియలో పీవోలు క్రియా శీలకంగా వ్యవహరించాలని, ఎన్నికల నిబంధనలను పక్కాగా పాటిస్తూ సజావుగా నిర్వహించాలన్నారు. తాండూర్ మండలంలో మంగళవారం ప్రిసైడింగ్ అధికారులకు, స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణలో అవగాహన కల్పించారు. సకాలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. చెక్‌లిస్ట్‌కు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు, ఇతర సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. సీటింగ్ అరెంజ్‌మెంట్. సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వంటి నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటరు ఓటు వేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అబ్జర్వర్ ఈర్ల శంకర్, జనరల్ అబ్జర్వర్ మనోహర్, తహసీల్దార్ జ్యోత్స్న, మాదారం ఎస్సై సౌజన్య, డీఎల్పీవో సతీష్, జోనల్ అధికారులు సంతోష్, మనోహర్, లత తదితరులు పాల్గొన్నారు.



## సుబ్రమణ్య స్వామి
# ఆలయంలో పూజలు

**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని అయ్యప్ప క్షేత్రం మల్లన్న గుట్ట సుబ్రమణ్య స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు పోటెత్తారు. సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు గిరి ప్రదర్శన నిర్వహించారు. అభిషేక పూజ కార్యక్రమాలను చేపట్టగా ఆలయ వ్యవస్థాపకులు అల్లల్ల వినోద మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు నవయుగమూర్తి వేణుగోపాల్ అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## వర్షాలతో దెబ్బతిన్న
# రోడ్ల మరమ్మతులు
### నిర్మల్ జిల్లా కలెక్టర్ వినూత్న డ్రైవ్



**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వర్షాల కారణంగా దెబ్బతిన్న జాతీయ, అంతర్గత రోడ్ల మరమ్మతుల కోసం ఒక వినూత్నమైన క్యూఆర్ కోడ్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించారు. గత ఐదు రోజులలో నిర్మల్ పట్టణంలోనే రోడ్ల మరమ్మతులపై 28 ఫిర్యాదులు అందినట్లు మున్సిపల్ డిఈ హరి భువన్ గౌడ్ తెలిపారు. గాజుల్ పెట్, వైయస్సార్ కాలనీ, సోఫినగర్, అస్రా కాలనీ, ప్రియదర్శి నగర్ రోడ్లకు సంబంధించిన ఈ ఫిర్యాదులపై ఇప్పటికే బృందాలు మరమ్మతుల అంచనాలు వేయడం ప్రారంభించాయి.






## తొలి విడత పంచాయతీ ఎన్నికలను
# విజయవంతం చేయాలి

- ఎలాంటి సమస్యలు కలగకూడదు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- మొదటి విడత ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నాం
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మొదటి విడత గ్రామపంచాయితీ ఎన్నికలను ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అబ్జర్వర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాల వారిగా మొదటి విడత ఎన్నికలు నిర్వహించే సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలు, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కొరకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సామాగ్రి పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించాలని అన్నారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, రెండు వందల మీటర్ల పరిధిలో అనధికార వ్యక్తులు ఉండకుండా చూడాలన్నారు. ఉపసర్పంచ్ ఎన్నికలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాలో మొదటి విడత ఎన్నికల్లో భాగంగా ఆరు మండలాల్లో, 166 సర్పంచ్, 1392 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి అని చెప్పారు. పోలింగ్ సామాగ్రి పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. సరిపడినంత మంది సిబ్బందిని నియమించడంతో పాటు, వారికి శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెప్పారు. పోలీసు బందోబస్తుతో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మొదటి విడత ఎన్నికలను ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి చేస్తామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్, ఎన్నికల సాధారణ పరిశీలకులు టి.వెంకన్న, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, డిపిఓ రమేష్, డిడబ్ల్యుఓ మిల్కా, డివిల్పీవో ఫణిందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



### ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన
## కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని మంగళవారం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఎల్లప్పుడు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

### చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా
## విధులు నిర్వర్తించాలి

**తాండూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
తాండూర్ మండలం రేపల్లెవాడ అంతర్ జిల్లా పోలీస్ చెక్‌పోస్టును ఎన్నికల అబ్జర్వర్ మనోహర్ మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేసి అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బారికేటింగ్ విధానం, వాహనాల తనిఖీ చేయవలసిన పద్ధతి, తనిఖీ సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కు వ్యతిరేకంగా లభించిన డబ్బులు, ఇతర సామగ్రి, వాటిని స్వాధీనం చేసుకునే విధానాన్ని వివరించారు. చెక్ పోస్టులో విధులు నిర్వర్తించే సిబ్బంది నిరంతరం అలర్ట్‌గా ఉండాలన్నారు. ఏచిన్న విషయాన్ని తేలిగ్గా తీసుకోవద్దన్నారు. అబ్జర్వర్ వెంట తహసీల్దార్ జ్యోత్స్న, డిప్యూటీ తహసీల్దార్ కల్పన, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులున్నారు.



# స్వేచ్ఛాయుతంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఓటు హక్కు వినియోగించుకునే ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓటరు గుర్తింపు కార్డు చూపించాలి
- ఎన్నికల సిబ్బందికి సహకరించాలి
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**గాదిగూడ, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఓటరు తప్పనిసరిగా ఫొటో గుర్తింపు పత్రం చూపాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మంగళవారం నార్నూర్, గాదిగూడ మండలాల్లో ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల తొలి విడత నేపథ్యంలో గాదిగూడ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బంది కూర్చొబెట్టే విధానం, ఓటింగ్ సామగ్రి పంపిణీ, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించి, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఓటరు తప్పనిసరిగా ఫొటో గుర్తింపు పత్రం చూపాలన్నారు. 18 ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి వెంట తీసుకువెళ్లాలని అన్నారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వ, స్థానిక సంస్థ ఉద్యోగుల సర్వీస్ స్మార్ట్ కార్డు, జాబ్ కార్డు, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు (కార్మిక శాఖ), ఫొటో ఉన్న పెన్షన్ పత్రం, రేషన్ కార్డు, ఫొటో ఉన్న స్వాతంత్ర్య సమర యోధుల కార్డు, ఫొటో ఉన్న ఆయుధ లైసెన్స్, వికలాంగుల సర్టిఫికేట్, ఫొటో ఉన్న పట్టాదారు పాస్‌బుక్ చెల్లుబాటు అవుతుందన్నారు. ఇతర నియోజకవర్గంలో జారీ చేసిన కార్డులు కూడా చెల్లుతుందన్నారు. అయితే, ఓటరు పేరు తన పోలింగ్ కేంద్రంలోని ఓటర్ జాబితాలో తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలింగ్ సమయంలో ఉపయోగించిన పత్రం చివరి నాలుగు అంకెలను బ్యాలెట్ కౌంటర్ ఫాయిల్/ఓటర్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ మార్గదర్శకాలను అన్ని పోలింగ్ సిబ్బందికి స్పష్టంగా వివరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎంపీడీవో, తహసిల్దార్, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
- మొదటి విడత ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నాం
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే




**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలు మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి ఎన్నికల సంఘం కమిషన్ సభ్యులతో కలిసి మంగళవారం వీసీ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు, సాధారణ, వ్యయ పరిశీలకులతో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు తీసుకోవాల్సిన చర్యలు, ఓట్ల లెక్కింప, ఉప సర్పంచ్ ఎన్నిక, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఓటర్ల ప్రభావితం అంశాలను అరికట్టడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు లోబడి ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని, ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో వీసీ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోతేర, ఎస్పీ నితికాపంత్, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీఓ భిక్షపతిగౌడ్, నోడల్ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా ఐదు మండలాల్లో 106 గ్రామ పంచాయతీ సర్పంచ్, 327 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేశామని చెప్పారు. స్టేజ్-2 ఆర్‌ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, పోలింగ్, ఇతర పోలింగ్ అధికారులకు శిక్షణ అందించి పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే సామగ్రి పంపిణీ కేంద్రంలో కౌంటర్లు ఏర్పాటు చసి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఐదు మండలాల ఎంపీడీవో, పోలీసు అధికారులతో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో తీసుకోవాల్సిన చర్యలు, పోలింగ్ నిర్వహణపై సమీక్షించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల
## నిర్వహణపై అధికారులకు శిక్షణ

**కాసిపేట, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి స్టేజ్ 2 ప్రిసైడింగ్ అధికారులకు, జోనల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బ్యాలట్ బాక్సుల ఏర్పాటు, తీసే విధానం, సీల్ చేసే విధానాన్ని చూపించారు. బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల నిర్వహణ ఎలా చేయాలి అనేది వివరించారు. అభ్యర్థులకు ఇచ్చే సూచనలు, పోలింగ్ కేంద్రంలో భద్రత ఏర్పాట్లను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సప్దర్ అలీ, ఎంఈవో ముక్తవరం వెంకటేశ్వర స్వామి, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీ నారాయణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం సాంబ మూర్తి, అన్నం రమణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కోదాది తిరుపతి, ప్రిసైడింగ్ అధికారులకు, జోనల్ అధికారులు పాల్గొన్నారు.






## మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో
# ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదు

■ కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మొదటి విడత గ్రామపంచాయితీ ఎన్నికలను ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అబ్జర్వర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాల వారిగా మొదటి విడత ఎన్నికలు నిర్వహించే సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలు, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల వివరాలను ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కొరకు పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సామాగ్రి పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించాలని అన్నారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, రెండు వందల మీటర్ల పరిధిలో అనధికార వ్యక్తులు ఉండకుండా చూడాలన్నారు. ఉపసర్పంచ్ ఎన్నికలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో ఆరు మండలాల్లో 120 గ్రామ పంచాయతీ స్థనాలకు మొదటి దశ ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. సూక్ష్మ పరిశీలకులు, పిఓ, ఓపిఓ, ఇతర అధికారులను అవసరానికి అదనంగా నియమించుకోవడంతో పాటు, వారికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. సరిపడినంత పోలింగ్ సామాగ్రి అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఎన్నికల సామాగ్రి పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, పకడ్బందిగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం మాట్లాడుతూ, మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. ఇప్పటికే దాదాపు ఓటరు స్లిప్ ల పంపిణీని పూర్తి చేశామని అన్నారు. ఎన్నికల ప్రక్రియను వెబ్ కాస్టింగ్ చేసేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, మొదటి దశ గ్రామ పంచాయితీ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీవో రత్నకల్యాణి, డిపిఓ శ్రీనివాస్, డీఈఓ భోజన్న, జెడ్పీ సీఈవో శంకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## నిజాయితీ పరులను..
# సర్పంచులుగా గెలిపించండి
### ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు..

**బెజ్జూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల్లోని రుద్రాపూర్, ముంజంపల్లి, బారెగూడ గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు గోగుల శంకరమ్మ లక్మయ్య, పొర్శెట్టి వెంకటాచలం, తేలి సుశీల బాపుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతిపరులను గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓడించాలని, మంచివారికి అండగా నిలవాలని గ్రామస్తులను కోరారు. ప్రాణహిత కాలువ భూసేకరణ విషయంలో అవినీతికి పాల్పడిన నాయకులు మళ్లీ కొత్త వేషం వేసుకొని వస్తున్నారని, వారికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రోడ్డు కనెక్టివిటీ లేని గ్రామాలకు కొత్తగా రోడ్లు నిర్మించనున్నామని, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు, వినియోగించనున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మురళీ గౌడ్, భిక్షపతి, తిరుపతి భాజపాలో చేరారు. వీరికి ఎమ్మెల్యే భాజపా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# యువత ఆత్మ బలిదానాలకు చలించిన గొప్ప నాయకురాలు

### సోనియా జన్మదిన వేడుకల్లో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి



**ఇచ్చోడ, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షను యూపీఏ చైర్పర్సన్‌గా సోనియాగాంధీ అర్థం చేసుకుని తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల చారి, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం ఇచ్చోడలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సోనియా గాంధీ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు తినిపించుకొని సోనియా గాంధీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ కోసం ఆత్మ బలిదానాలు చేసుకుంటున్న యువకుల త్యాగాలు చూసి చలించిపోయి పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసినా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన తెలంగాణ తల్లి సోనియా గాంధీ అని వారు కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన దేవత అన్నారు. ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మార్కెట్ కమిటీ అధ్యక్షులు సత్యవతి కోటేష్, కళ్లెం నారాయణరెడ్డి, మైనార్టీ సెల్ చైర్మన్ ముస్తఫా, ఎస్సీ సెల్ చైర్మన్ కొత్తూరు లక్ష్మణ్, మండల అధ్యక్షులు నైతం నాగరాజు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు రషీద్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు షేక్, మహబూబ్, సాదిక్, షేక్ మహబూబ్, రసూల్ ఖాన్, షేక్ అహ్మద్ తదితరులు ఉన్నారు.



## పోలింగ్ కేంద్రాన్ని
# తనిఖీ చేసిన తహసీల్దార్

**బెజ్జూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండలం చిన్న సిద్ధాపూర్ పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ రామ్మోహన్ మంగళవారం తనిఖీ చేసారు. 14న స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీరాముల తిరుపతి, గ్రామ కార్యదర్శి తుకారం పాల్గొన్నారు.

# 42 గ్రామ పంచాయతీలకు 3 ఏకగ్రీవం

**కుభీర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**



మండలంలోని 42గ్రామ పంచాయతీలకు మూడో విడత స్థానిక సర్పంచ్ వార్డ్ సభ్యులకు 17న ఎన్నికలు నిర్వహించగా ఇందులో మంగళవారం ఆయా గ్రామంలో ఉన్న గ్రామ పంచాయతీలకు సర్పంచులు పోటీ పడగా ఇందులో మూడు గ్రామ పంచాయతీలు జంగావ్,మనకుర్ నావనిత బ్రమేశ్వర్, రాథోడ్ రేఖ బాయి పల్సి తండా ఆడే అర్జున్ గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డ్ సభ్యులను ఎకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దింతో మిగితా 39గ్రామ పంచాయతీలో ఎన్నికలు జరుపడం జరుగుతుందని ఎన్నికల అధికారి ఎంపీడీఓ సాగర్ రెడ్డి తెలిపారు. ఏకగ్రీవమైన గ్రామ సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# కార్యకర్తలను పరామర్శించిన అల్లోల



**నిర్మల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ మండలంలోని మద్ది గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లేష్ సోదరుడు రాజేశ్వర్ ఇటీవలే అనారోగ్యానికి గురి కావడంతో మంగళవారం మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయన అనారోగ్యానికి గురికావటం బాధాకరమని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

### కుమ్రంభీం కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరుగనున్న ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం తుంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మూడో విడత ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడు విడతలుగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో కుర్చీలు, టేబుళ్లు, వెలుతురు సరిపడ ఉండేలా చర్యలు తీసుకోవాలని, విధులు నిర్వహించే సిబబందికి తాగునీరు, అల్పాహారం, భోజనం సకాలంలో అందించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ నిర్వహణ, కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బంధీగా చేయాలని అదికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి సదుపాయాలతో నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# రైలు కింద పడి యువకుడి మృతి

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో రైలు కింద పడి సాగె శ్రీనివాస్ (35) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు మంచిర్యాల జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ జస్పల్సింగ్ తెలిపారు. హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్, మంచిర్యాలలో ఇంటర్నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. సంతానం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికిగురై ఈ ఘాతుకానికి పాల్పడినట్లు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఎన్నికల నిబంధనలు పాటించాలి

- పోలింగ్ కేంద్రాల 144సెక్షన్ అమలు
- సెల్ ఫోన్లు, వాటర్ బాటిల్స్, ఇంకు బాటిల్స్, పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదు..
- రెచ్చగొట్టే వాఖ్యలు, సోషల్ మీడియాలో గొడవలకు దారి తీసేలా పోస్టులు చేసిన వారిపై పోలీసు చర్యలు తప్పవు..
- విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు..
- ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్

**ఉట్నూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మండలంలో జరిగే ప్రతి ఒక్క గ్రామంలో పోలీసులు సూచించిన నియమాలను పాటించాలని ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్ సూచించారు. పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. ప్రతీ ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని 100 మీటర్ల వద్ద 200 మీటర్ల వద్ద ప్రత్యేక నియమ నిబంధనలు ఉంటాయని వాటిని పాటించాలని, ప్రజల అనవసరంగా గుమిగూడి ఉండరాదని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలోనికి సెల్‌ఫోన్‌లు, వాటర్ బాటిల్‌లు, ఇంకు బాటిల్లు, ఆయుధాలు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వాటికి అనుమతులు ఉండవని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ పద్ధతిని పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ కేంద్రాలలోనికి అనుమతి ఇస్తారని తెలిపారు. తమ వెంట ఓటర్ ఐడి కార్డులను, గుర్తింపు కార్డులను తెచ్చుకోవాలన్నారు. వాట్సాప్‌లో సోషల్ మీడియా నందు ఇతరులకు రెచ్చగొట్టేలా కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాలలో సైలెన్స్ పీరియడ్ ప్రారంభమవుతుంది, ప్రచారాలు నిషేధం చేయబడతాయి. బయట వ్యక్తులు గ్రామాలలో ఉండవద్దన్నారు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని, గొడవలకు, అల్లర్లకు పాల్పడకూడదన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, అధికారుల అనుమతితో నిర్ధారించిన రోజులలో అనుమతి తీసుకుని నిర్వహించుకోవాలి. సున్నితమైన ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజలలో పోలీసుల పట్ల ధైర్యం నమ్మకం పెంపొందించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేయడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కఠినమైన చర్యలతో విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు. ఎలాంటి సమాచారం డయల్ 100 ద్వారా పోలీసు సహాయాన్ని సంప్రదించవచ్చని, అదేవిధంగా డబ్బు, మద్యం, బహుమతులు లాంటివి పంచేక్రమంలో పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.



## డిసెంబర్ 9వ తేదీ చరిత్రలో ఓ మైలురాయి

### బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**బెల్లంపల్లి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ కోసం కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి నిరహార దీక్ష చేసిన చారిత్రక దినం విజయ్ దివాస్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలంగాణ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సందర్భంగా దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ రథసారథి కేసీఆర్ 11 రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి, ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ ప్రకటన వెలువడేలా చేశారని తెలిపారు. ఈ చారిత్రక రోజు కేసీఆర్ ఉక్కు సంకల్పం ముందు కేంద్రం తలొగ్గి, తెలంగాణ ప్రకటించిందన్నారు. ఆనాడు సమైక్య ఆంధ్ర నాయకులు తెలంగాణ అనే పదాన్ని నిషేధించారని తెలిపారు. ఎక్కడ మాట్లాడినా వెనుకబడ్డ ప్రాంతం అనే వారు అలాంటి ఆస్తిత్వమే లేని పరిస్థితుల నుండి సగర్వంగా నాది తెలంగాణ అని చెప్పుకునే స్థాయికి వచ్చిందంటే దానికి కారణం కేసీఆర్ అని పేర్కొన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి అలాగే, అంబేద్కర్ విగ్రహానికి, పూలమాల వేసి ఆ మహనీయులను స్మరించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ జనరల్ సెక్రెటరీ విజయకుమార్ పాల్గొన్నారు.

## నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

### మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి

**మందమర్రి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ప్రజలందరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం చిర్రకుంట, పొన్నారం, వెంకటాపూర్, పులి మడుగు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సీఐ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలందరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓట్లు వేయాలన్నారు. ప్రజలు, రాజకీయ నాయకులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మందమర్రి, రామకృష్ణపూర్ ఎస్ఐలు రాజశేఖర్, రాజశేఖర్, పోలీసులు పాల్గొన్నారు. కోటపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి, గొడవలు అల్లర్లకు తావు లేకుండా ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని సిర్సా గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కోటపల్లి, చెన్నూరు ఎస్ఐలు రాజేందర్, సుబ్బారావు, జగదీశ్వర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.






## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారం ఈ నెల 21న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ వీరయ్య కోరారు. మంగళవారం జిల్లా ప్రధాన న్యాయస్థానంలో న్యాయవాదులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ లను నిర్వహిస్తున్నామన్నారు. ఇరుపక్షాలతో మాట్లాడి ఎక్కువ సివిల్ కేసులను రాజీకి మార్గం వైపు మళ్లించేలా సూచించాలన్నారు. మోటర్ వాహన నష్టపరిహారం ఎన్ఐ యాక్ట్, క్రిమినల కేసులు, సివిల్ ధావాలు పరిష్కరిష్కరించుకోవచ్చునని తెలిపారు. జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కాంపౌండ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు తగిన సహకారం అందించాలని కోరారు. కక్షిదారులకు ఈ లోక్ అదాలత్ గురించి వివరించి వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు సమన్వయంతో సహకారం అందిచాలన్నారు. ఇందు కోసం న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే తగిన న్యాయ సలహా సహాయాలు సైతం అందిస్తామని వెల్లడించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఏ నిర్మల, ఉపాధ్యక్షులు భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

- అల్లర్లు సృష్టిస్తే క్రిమినల్ కేసులు
- ఎన్నికలకు ప్రతీ ఒక్కరు సహకరించాలి
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్

**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికలు వాంకిడి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగపూర్ మండలాల్లో 11న జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ బందోబస్త్ సంసిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సైలెంట్ పీరియడ్ అమలు పోలింగ్‌కు 44 గంటల ముందు నుండి మంగళవారం సాయంత్రం 5:00 గంటల నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో ఎన్నికల సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారం, లౌడ్‌స్పీకర్ వినియోగం, ర్యాలీలు, బైక్ ర్యాలీలు పూర్తిగా నిషేధం. ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పహారా, నిఘా బృందాలు, రూట్ మొబైల్, స్ట్రైకింగ్ ఫోర్స్‌తో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మొదటి విడత ఎన్నికల కోసం 550 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, 200 మంది ఇతర శాఖల సిబ్బంది మొత్తం 750 మందిని నియమించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లాలో 163 (144 సెక్షన్) అమల్లో ఉంటుందని, ఎన్నికల కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా ఆ పైగా వ్యకులు గుంపులు గుమికూడరాదన్నారు. అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలు అక్కడ సమూహాలుగా ఉండకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలింగ్‌కు 44 గంటల ముందు నుండి ఏ విధమైన ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం. ఎన్నికలు స్వచ్ఛంగా, ప్రశాంతంగా జరగేందుకు ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడిన కేసీఆర్

### మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



**మందమర్రి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ ఆమరణ నిరహార దీక్ష చేపట్టడంతో పాటు విద్యార్థుల ఆత్మబలిదానాలు, ప్రజా పోరాటాలతో తెలంగాణ స్వరాష్ట్ర కళ సాకారమైందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ తెలిపారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ విజయ్‌దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో దీక్షా విజయ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, నాయకులు గాదె సత్యం, అంకం నరేష్, ఎండీ మహమూద్, సింగిల్ విండో చైర్మన్ సందెల వెంకటేష్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రకటన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం చెన్నూరు పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ క్షీరాభిషేకం చేశారు.



కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతోనే కేంద్రం దిగివచ్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవారం దీక్ష విజయ్ దివస్ వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సబ్బని అరుణ్, నూనె సత్యనారాయణ, మద్దెల గోపి, పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమావళి పాటించాలి

- ప్రచారం ముగిసింది.. ఎవరూ నిబంధనలను అతిక్రమించవద్దు
- ఆరు మండలాల్లో నిషేధాజ్ఞలు అమలు
- మద్యం దుకాణాలు మూసివేత
- ఎన్నికల సిబ్బందికి ప్రతీ ఒక్కరు సహకరించాలి
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలో 11న జరగనున్న తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా, ఎన్నికల ప్రచారంపై అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. తొలి విడత ఎన్నికలు జరిగే ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల పరిధిలో మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసిందని, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలని, ప్రచార సమయం ముగియడంతో ఆ తర్వాత బహిరంగ ప్రచారానికి అనుమతి ఉండదని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఎన్నికల ప్రచార సమయం ముగియడంతో నిషేధాజ్ఞల అమలులోకి వచ్చినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఇప్పటికే ఈ ఐదు మండలాల్లో నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధమన్నారు. అదే విధంగా ఎన్నికలు జరగనున్న మండలాల్లో మద్యం దుకాణాలు పోలింగ్, ఓట్ల లెక్కింపు ముగిసే వరకు మూసివేయాలని ఆదేశించారు. 11న ఉదయం 7:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఓట్ల లెక్కింపు కూడా పోలింగ్ ముగిసిన అనంతరం, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాలను వెల్లడించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.



### కుమ్రంభీం జిల్లా కలెక్టరేట్‌లో

## తెలంగాణ తల్లి విగ్రహా విష్కరణ

**ఆసిఫాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో 15 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కలెక్టరేట్ అధికారులు, రహదారులు భవనాల శాఖ అధికారులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గేయం జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



**బెల్లంపల్లి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లిలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ 69వ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. దశాబ్దాల తెలంగాణ రాష్ట్ర కలను నిజం చేసిన త్యాగమూర్తి సోనియాగాంధీ అని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా ఆమె సేవల్ని కొనియాడారు. అదేవిధంగా యూపీఏ చైర్మన్, పార్లమెంట్ మెంబర్ గా సోనియా గాంధీ అటు దేశానికి, పార్టీకి విశిష్టమైన సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శంకర్, మాజీ కౌన్సిలర్ శ్యామ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూర్ణచందర్, మత్తమారి శ్రీనివాస్, పీక లక్ష్మణ్, రమేష్,బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ



**మావల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

మావల హరితవనం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సును వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో బస్సు వెనుక అద్దాలు పగిలి, వెనుక భాగం ధ్వంసమైంది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు.

## గుండెపోటుతో అటెండర్ మృతి

**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్గా పనిచేస్తున్న కోమటి రాజన్న గుండెపోటుతో మృతిచెందారు. మంగళవారం తెల్లవారుజామున రాజన్నకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతిచెందారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. రాజన్న ఎంపీడీవో కార్యాలయంలో పది సంవత్సరాలుగా అటెండర్‌గా సేవలందిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలో పలువురి చేరిక



**కెరమెరి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

నేటికీ ప్రజలు బిఆర్ఎస్ కే మద్దతు తెలుపుతున్నారని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. కెరమెరి మండలం గోయెగావ్, కొఠారి కామాలు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కోవలక్ష్మి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ హయాంలోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయి అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోములే అన్నారావు, సోనులే బాపు, నగోషా పాండు, గూర్నులే నారాయణ, పర్ది వాసు, మోర్లే జ్ఞానేశ్వర్, సిడం భీమ్రావు, దేవ్షిండ్ దినేష్, జి. నిఖిల్, బాపూజీ, అతీఫ్ పాల్గొన్నారు.

## డిసెంబర్ 9 తెలంగాణ ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయం

### మాజీ మంత్రి జోగు రామన్న - బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా విజయ్ దివాస్ వేడుకలు




**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ రథసారథి కేసీఆర్ 11 రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి, ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ ప్రకటన వెలువడేలా చేసిన చిరస్మరణీయమైన రోజు అని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. డిసెంబర్ 9 అంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం గెలిచిన రోజని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం విజయ్ దివాస్ వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి, తెలంగాణ తల్లి విగ్రహాలకు పార్టీ శ్రేణులతో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు జోగు రామన్న మాట్లాడు తూ... కేసీఆర్ ఉక్కు సంకల్పం ముందు కేంద్రం తలొగ్గి, తెలంగాణ ఏర్పాటును ప్రకటించిన రోజు నేడు పండగల నిర్వహించుకుంటున్నామన్నారు. తెలంగాణ ప్రజలు పొందాల్సిన నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఈ ఉద్య మం జరిగిందని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### విద్యార్థులకు ఐటీడీఏ

## పీవో మార్గనిర్దేశం

**ఉట్నూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ఆధ్వర్యంలో కేర్ అకాడమి కేబీ కాంప్లెక్స్‌లో నెల రోజుల అసిస్టెంట్ నర్స్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని, ఆన్-జాబ్ ట్రైనింగ్ కోసం ఎంపికైన విద్యార్థులను ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ (పీవో) యువరాజ్ మర్మాట్ అభినందించారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జేడీఎం నాగభూషణం, విద్యా అకాడమీ మేనేజర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

### గుడుంబా స్థావరాలపై

## పోలీసుల దాడులు

**కుభీర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

కుభీర్ మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం పోలీసులు గుడుంబా నిర్వహిస్తున్న స్థావరాలపై దాడులు నిర్వహించారు. వివిధ తండాలో గుడుంబా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలుసుకుని ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి తొమ్మిది వందల లీటర్ల గుడుంబాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. గుడుంబాను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తానూర్ మండలంలో వివిధ గిరిజన గ్రామాల్లో మంగళవారం సాయంత్రం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన గుడుంబాలను పట్టుకున్నట్టు ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో గుడుంబా తయారు చేసిన విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# ‘స్పిరిట్’కి స్పెషల్ సెట్..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్టార్ లైనప్ లో భారీ అంచనాలు ఉన్న సినిమా ‘స్పిరిట్’. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ఓ పవర్ ఫుల్ కాప్ స్టోరీగా రాబోతుంది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ కోసం ఓ స్పెషల్ పోలీస్ స్టేషన్ సెట్ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సెట్ లో ప్రభాస్ పై ఎంట్రీ సాంగ్ ను షూట్ చేస్తారట. ఈ సాంగ్ లో ప్రభాస్ తో పాటు మరో హీరోయిన్ కూడా కనిపిస్తోందని తెలుస్తోంది. అన్నట్టు ఈ సాంగ్ షూట్ అనంతరం యాక్షన్ సీక్వెన్స్ ల షూట్ ను స్టార్ట్ చేస్తారట.కాగా ఈ యాక్షన్ ఎపిసోడ్స్ సినిమా మొత్తంలోనే హైలైట్ అవుతాయట. పైగా ఈ సీక్వెన్స్ ఈ సినిమా మొత్తానికే మెయిన్ హైలెట్ గా నిలిచిపోతుందట. కాగా మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ తో సందీప్ రెడ్డితో మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా పూర్తి చేశాడు. ఈ చిత్రాన్ని టి-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. అన్నట్టు ‘స్పిరిట్’ మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందని.. సందీప్ రెడ్డి వంగా నుంచి మరో వినూత్న సినిమా రాబోతుందని తెలుస్తోంది.

# రూటు మార్చిన మిల్కీ బ్యూటీ



తమన్నా భాటియా. ముందు చిన్న హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మిల్కీ బ్యూటీ చాలా తక్కువ టైమ్ లోనే స్టార్ హీరోలందరి సరసన జత కట్టి స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగారు. అయితే గత కొన్నాళ్లుగా తమన్నా బాలీవుడ్ లో బాగా బిజీ అయిపోయిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ బిగ్ బడ్జెట్ సినిమాల్లో ఎక్కువగా ఐటెం సాంగ్స్ చేస్తూ అలరిస్తున్నారు తమన్నా.గత కొన్నాళ్లుగా తమన్నాను ఎక్కువగా ఐటెం సాంగ్స్ లోనే ఆడియన్స్ చూస్తూ వచ్చారు. అలాంటి తమన్నా ఇప్పుడు తన రూట్ ను మార్చి ఓ బాలీవుడ్ బయోపిక్ లో కీలక పాత్ర చేస్తున్నారు. లెజండరీ డైరెక్టర్ వి. శాంతారామ్ జీవిత చరిత్ర ఆధారంగా బాలీవుడ్ లో ఓ సినిమా తెరకెక్కుతుండగా అందులో శాంతారామ్ రెండో భార్య, ఒకప్పటి నటి అయిన జయశ్రీ గడ్కర్ పాత్రలో తమన్నా కనిపించనున్నారు.రీసెంట్ గా మేకర్స్ ఆ సినిమా నుంచి తమన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేయగా, అందులో తమన్నా వింటేజ్ సెటప్ లో చీర కట్టులో ఎంతో అందంగా మెరిశారు. ఇంకా చెప్పాలంటే తమన్నా ఆ పోస్టర్ లో ఒక వింటేజ్ నటి యొక్క వైబ్ ను తీసుకొచ్చారు. కెరీర్లో ఇప్పటివరకు ఎక్కువగా గ్లామరస్ రోల్స్ చేసిన తమన్నా రీసెంట్ గా ఎక్కువగా ఐటెం సాంగ్స్ చేస్తూ వచ్చి, ఇప్పుడు సడెన్ గా ఓ బయోపిక్ లో కీలక పాత్ర కు ఎంపికవడం విశేషమనే చెప్పాలి.మరి రెగ్యులర్ గా తమన్నాను గ్లామరస్ లుక్స్ లో చూడటం అలవాటు చేసుకున్న ఆడియన్స్ ను తమన్నా ఈ సినిమాతో ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి. అయితే నటిగా తమన్నా ఇప్పటివరకు ఎప్పుడూ ఫెయిలైంది లేదు. తన వద్దకు వచ్చిన పాత్రకు 100% న్యాయం చేసే తమన్నా మరి ఈ బయోపిక్ తో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటారో చూడాలి. అభిజీత్ శిరీష్ దేశ్ పాండే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.



# అన్యాయంగా నాపై నిందలు

చిన్న వయసులోనే ఎన్నెన్నో నిందలు అనుభవించాల్సి వచ్చిందని... తాను నటించిన సినిమాలు విజయవంతం కానప్పుడు సామాజిక మాధ్యమాల్లో అన్యాయంగా తనని లక్ష్యం చేసుకుని విమర్శించడం ఎంతో బాధించిందని కన్నీటి పర్యంతమైంది కృతిశెట్టి. ‘ఉప్పెన’ సినిమాతో పరిచయమైన కథానాయిక ఆమె. తొలి చిత్రమే ఘన విజయం సాధించడంతో వరుస అవకాశాల్ని సొంతం చేసుకొంది. అయితే చెప్పకోదగ్గ విజయాల్ని మాత్రం సొంతం చేసుకోలేకపోయింది. ఈ నెల 12న కార్తితో కలిసి ‘అన్నగారు వస్తారు’ చిత్రంతో సందడి చేయనుంది. ఆ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన ప్రయాణం గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురైంది కృతిశెట్టి. “నటన అపారమైన భావోద్వేగ శక్తిని డిమాండ్ చేస్తుంది. అలాంటి సమయాల్లో ఎలాంటి కారణం లేకుండా ద్వేషాన్ని స్వీకరించాల్సి రావడం భరించలేని విషయం. మన నియంత్రణకు మించిన విషయాలపై కూడా విమర్శల్ని ఎదుర్కోవాలంటే బాధ కలుగుతుంద”ని తనపై వచ్చిన ట్రోల్స్‌పై అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆరంభంలో ఒక దశలో నట ప్రయాణం ఆపేద్దామని కూడా అనుకున్నానని చెప్పుకొచ్చింది కృతి. “తొలి రోజుల్లో కూ, నా తల్లిదండ్రులకీ సినిమా గురించి పెద్దగా అవగాహన లేదు. నటిగా ఒక సినిమా విషయంలో నాకంటూ కొన్ని అంచనాలు ఉంటాయి. దాంతో తీవ్రంగా ఒత్తిడికి గురయ్యేదాన్ని. దాంతో జుట్టు కూడా రాలిపోయేది. చర్మ సంబంధిత సమస్యలూ చుట్టు ముట్టాయి. కష్టంగా ఉంటే సినిమాల్లో చేయొద్దని అమ్మానాన్నలూ చెప్పారు. నేనూ ఆ దిశగా ఆలోచించా. కానీ ‘ఉప్పెన’తో దక్కిన ప్రేక్షకుల ఆదరణ నాకు ఉత్సాహాన్నిచ్చింద”ని చెప్పుకొచ్చింది కృతిశెట్టి. తన సినీ ప్రయాణంలో ఇంకా ఉత్తమ దశ రాలేదన్న ఆమె, భిన్న భాషల్లో కెరీర్‌ని మలుచుకోవడంపై దృష్టిపెట్టింది.

# ‘అఖండ 2’ మౌనం..



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ లేటెస్ట్ చిత్రం ‘అఖండ 2’ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డిసెంబర్ 5న రిలీజ్ కావాల్సిన ఈ సినిమా కొన్ని కారణాల వల్ల చివరి నిమిషంలో వాయిదా పడింది. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

బోయపాటి-బాలయ్య కాంబోలో మరోసారి సినిమా వస్తుండటంతో ‘అఖండ 2’ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా అని అందరూ ఆశగా చూశారు.అయితే, ఈ చిత్ర కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడు ప్రకటిస్తారా అని అభిమానులతో పాటు ఇతర చిత్రాల హీరోలు, మేకర్స్ కూడా ఆతృతగా చూస్తున్నారు. చిత్ర వర్గాల నుండి వస్తున్న సమాచారం ప్రకారం అఖండ 2 చిత్ర కొత్త రిలీజ్ డేట్ డిసెంబర్ 12గా ఫిక్స్ చేసే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. దీంతో ఇప్పటికే ఆ తేదీన రిలీజ్ కానున్న పలు చిత్రాలు అయోమయంలో పడ్డాయి. మోగ్లీ, సైక్ సిద్ధార్థ, ఈషా తదితరల చిత్రాలు డిసెంబర్ 12న రిలీజ్ కానున్నాయి.కానీ, ఇప్పుడు అనుకోకుండా ‘అఖండ 2’ కూడా అదే రోజున రిలీజ్‌కి వస్తే, ఈ చిత్రాల పరిస్థితి ఎలా ఉండబోతుందా అని సినీ సర్కిల్స్‌లో చర్చ సాగుతోంది. మరి అఖండ 2 రిలీజ్ డేట్‌పై మౌనం ఎప్పుడు వీడుతుందో.. దాని ప్రభావం చిన్న సినిమాలపై ఎలా ఉండబోతుందో చూడాలి.

# ఊహించడానికే భయం వేసే చీకటి ప్రపంచం



‘లిటిల్ హార్ట్స్’, ‘రాజు వెడ్స్ రాంబాయి’ విజయాల తర్వాత నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి నుంచి వస్తున్న కొత్త చిత్రం ‘ఈషా’. త్రిగుణ్, అఖిల్ రాజ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని శ్రీనివాస్ మన్నె తెరకెక్కించారు. కేఎల్ దామోదర్ ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. “మీకు తెలియని.. మీరు ఊహించడానికే భయం వేసే చీకటి ప్రపంచం ఇంకొకటి ఉంది” అంటూ పృథ్వీ చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇది అతీంద్రియ శక్తులకు, సైన్స్‌కు మధ్య జరిగే సంఘర్షణతో ముడిపడిన కథ. ఆత్మలు లేవని బలంగా నమ్మే నలుగురు స్నేహితులు ఓ చీకటి ప్రపంచంలోకి అడుగు పెడితే.. అక్కడ వాళ్లకి ఎదురైన భయానక అనుభవాలేంటి? అన్నది ట్రైలర్‌లో ఉత్కంఠభరితంగా చూపించారు. ఈ ప్రచార చిత్రాన్ని బట్టి.. సినిమాలో ఉలిక్కిపాటుకు గురి చేసే హారర్ అంశాలు, ట్విస్ట్‌లు చాలానే ఉన్నట్లు అర్థమవుతోంది. “కళ్లు మూసుకున్నంత మాత్రానా గతం మారిపోదు” అంటూ ఆఖర్లో వినిపించిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి సంగీతం: ఆర్ఆర్ ధృవన్, ఛాయాగ్రహణం: సంతోశ్ సనమోని.



## పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంఅండ్‌హెచ్‌ఓ

**చెన్నూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
చెన్నూర్ నియోజక వర్గంలోని కుందారం, కోటపల్లి పీహెచ్సీలతో పాటు వేమనపల్లి పీహెచ్సీలను మంగళ వారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్సీలలో ఆరోగ్య కార్యక్రమాలు, అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వంద శాతం గర్భవతులు నమోదు, టీకాలు ఇప్పించడం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అసంక్రమణ వ్యాధులు, వాటి గుర్తింపు, చికిత్సలు, కీటక జనిత వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. అనంతరం జీపీ సాధారణ ఎన్నికలలో పాల్గొనే వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించి ఫస్ట్ ఎయిడ్ కిట్ లను అందజేశారు. డీఎం అండ్ హెచ్ఓ వెంట డిపిఓ ప్రశాంతి, సబ్యూనిట్ అధికారి శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణశ్రీ తదితరులున్నారు.

### ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో
## ఏర్పాట్లు పూర్తి చేయాలి

**వాంకిడి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం వాంకిడి మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దేవిడ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నిర్వహించే ఎన్నికల కోసం సామగ్రి పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగ కేంద్రం, స్ట్రాంగ్‌రూం, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల్లో వినియోగించే సామగ్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించా రు. కార్యక్రమంలో అధికారులు ఉమర్‌హుస్సేన్, తహసీల్దార్ పాల్గొన్నారు.

## స్కూళ్లకు 6 రోజులు సెలవులు!

**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి కొనసాగుతోంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో, ఆయా పోలింగ్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలలకు సుమారు ఆరు రోజుల పాటు సెలవులు లభించనున్నాయి. తొలి విడత పోలింగ్ దృష్ట్యా 10, 11 తేదీల్లో స్కూళ్లకు సెలవు ప్రకటించారు. అలాగే పోలింగ్ జరిగే జిల్లాల కలెక్టర్ల ఆదేశాలు ఇచ్చారు. రెండో విడత ఎన్నికల సందర్భంలో 13వ తేదీ (రెండో శనివారం), 14వ తేదీ (ఆదివారం) వస్తుంది. మూడో విడత పోలింగ్ సందర్భంగా 16, 17 తేదీల్లో సైతం ఆయా స్కూళ్లకు సెలవులు ఇస్తున్నారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్ సామగ్రి సిద్ధం చేయాల్సి ఉన్నందున ఈ సెలవులను పొడిగించడం జరిగింది. అలాగే, పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు, కార్మికులకు నెలవారీ వేతనంతో కూడిన సెలవును 11వ తేదీన ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తొలి విడత పోలింగ్ కోసం 10, 11 తేదీల్లో సెలవులు ప్రకటించిన స్కూళ్లు, మూడో విడత ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో 16, 17 తేదీల్లో కూడా మూతపడనున్నాయి. అదనపు సెలవుల కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వల్పకాలిక విరామాన్ని పొందుతున్నారు.

# ఒట్టేసి చెబుతున్నాం.. ఓటెయ్యం..!

- మా గ్రామాలను పట్టించుకోరా..?
- ఓట్ల సమయంలోనే గుర్తొస్తామా..
- అభివృద్ధి జరగలేదని గ్రామ శివారులో నిరసన
- గోపాల్‌పూర్, గోపాల్‌పూర్‌గూడ గ్రామస్తులు



**ఇంద్రవెల్లి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల గోపాల్‌పూర్, గోపాల్‌పూర్ గూడ గ్రామాల్లో అభివృద్ధి జరగలేదని, సర్పంచ్ ఎన్నికలకు దూరంగా ఉంటామని నిర్ణయించారు. మంగళవారం గ్రామానికి కొద్దిదూరంలో ఉన్న వాగు వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల ఎన్నికలతోపాటు ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు తమ గ్రామానికి వచ్చి అభివృద్ధి చేస్తామని నమ్మించి మోసం చేసి మా ఓట్లతో గెలిచిన తరువాత తమ గ్రామానికి ఎవరు కూడా రాకుండా పట్టించుకోవడం లేదని, ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదని అన్నారు. తమ గ్రామానికి రోడ్డు లేకపోవడంతో ప్రతి సంవత్సరం గ్రామస్తులు కలిసి శ్రమదానంతో మట్టిరోడ్డుకు బాగు చేస్తామని, గ్రామంలో తాగునీటి సౌకర్యం లేవని, సీసీరోడ్లు, మురుగు కాలువలు లేకపోవడంతో గ్రామంలో వర్షపు నీరు ఇండ్లలోకి వస్తుందని ఆరోపించారు. ఎవరికి ఓటు వేసిన ఫలితం లేదని, దీంతో ఈ సర్పంచ్ ఎన్నికలకు రెండు గ్రామాల ప్రజలు దూరంగా ఉండానికి నిర్ణయించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెస్రం ఇంద్రు, మెస్రం వినాయక్‌రావ్, మాల్కన్‌నాయక్, జీజాబాయి, మెస్రం రాంభాబాయి, కచ్‌కాడ్ దశరథ్, మెస్రం మాంజీరావ్, నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

### ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆదిలాబాద్ అంతా బాగు పడాలని తపనతో పని చేస్తున్నానని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం లో బాగంగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మావల, భీంసరి తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పంచాయతీ ఎన్నికల్లో సమర్థులను గెలిపిస్తే గ్రామానికి నిధులు తీసుకువచ్చేందుకు తన వంతుగా కృషి చేస్తానని పేర్కొ న్నారు. ఆదిలాబాద్ ప్రజలు ఎంతో కాలం ఎదురు చూస్తున్న ఎయిర్‌పోర్ట్‌ను తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేయడం జరిగిం దన్నారు. గ్రామాల్లో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ముకుంద్, రఘుపతి, దయాకర్ పాల్గొన్నారు.

## ముథోల్‌లో నియోజకవర్గంలో పోటాపోటీ






**ముథోల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మండలంలో మూడో విడత పంచాయతీ ఎన్నికలు నిర్వహించనుండగా మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. ముథోల్ మండలంలో 19 గ్రామ పంచాయతీలుండగా.. సర్పంచి స్థానాలకు 55, వార్డు స్థానాలకు 325 మంది అభ్యర్థులు బరిలో నిలవగా వారికి గుర్తు లను కేటాయించినట్లు ఎంపీడీవో లవ కుమార్ తెలిపారు. గ్రామాల వారీగా సర్పంచి స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు.. మండలంలోని ఆష్టాలో సర్పంచి స్థానానికి 2, బోరిగాంలో 3, బ్రహ్మణ్‌గావ్‌లో 2, చించాలలో 4, చింతకుంటలో 3, ఎడ్‌బిడ్ 4, ఎడిబిడ్ తండాలో 1(ఏకగ్రీవం), గన్నోరాలో 3, కారేగాంలో 2, మచ్కల్‌లో 3, ముద్గల్ సర్పంచు 2, ముథోల్‌లో 10, రాంటెక్‌లో 3, రువ్విలో 2, తరోడాలో 3, వెంకటాపూర్‌లో 2, విఠోలిలో 3, విఠలితండాలో సర్పంచు 1(ఏకగ్రీవం), వడ్తాలలో ఇద్దరు అభ్యర్థులు పోటీలు ఉన్నారని పేర్కొన్నారు. అదే విధంగా తానూరు మండలంలో 79 మంది సర్పంచ్ అభ్యర్థులు, మండలంలో 32 గ్రామ పంచాయతీలుండగా.. మూడు(కోలూరు తండా, హిప్పెల్లి తండా, బామ్నితండా) గ్రామాల్లో సర్పంచి స్థానాలు, 82 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగతా 29 పంచాయతీల్లో సర్పంచి స్థానాలకు 79 మంది, 186 వార్డులకు 410 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. కొలూరు తండా సర్పంచిగా పవార్ నిర్మలబాయి, హిప్పెల్లితండా సర్పంచ్ రాథోడ్ సంతోష్, బా మ్నితండాలో గులాబ్ సింగ్ సర్పంచ్‌గా ఏకగ్రీవం అయినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు గుర్తులు కేటాయించినట్లు వివరించారు. బాసర మండలంలో 10 గ్రామపంచాయతీలుండగా బిద్రెల్లి సర్పంచ్ విశ్వనాథ పటేల్ ఏకగ్రీవం అయ్యారు. మిగతా 9 గ్రామపంచాయతీల్లో సర్పంచి స్థానాలకు 37 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 90 వార్డులకు గాను 31 వార్డులు ఏకగ్రీవం కాగా.. మిగతా చోట్ల 173 మంది పోటీ చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు వివరించారు.

## వాగులు దాటేదెలా..?

### నేటికీ పూర్తి కాని పలు వంతెనల నిర్మాణాలు
### ఏళ్లు గడుస్తున్నా తీరని వెతలు

**కెరమెరి, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
భారీ వర్షాలు కురిస్తే చాలు ఆ గ్రామాల ప్రజలు ఆరిగోస పడాల్సిందే. కెరమెరి మండలంలో దశాబ్దం క్రితం మొదలు పెట్టిన వంతెన నిర్మాణ పనులు పూర్తి కాక పోవడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగులు పొంగితే సాహసం చేయక తప్పడం లేదు. మండలంలోని అనార్‌పల్లి, లక్మాపూర్ వాగులపై వంతెనలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు లక్మాపూర్ వాగు ఉప్పొంగి ప్రవహించింది. లక్మాపూర్ గ్రామానికి చెందిన కవిత, పవన్ దంపతుల ఏడాదిన్నర వయస్సు గల కుమారుడు ఉండగా అతడికి జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం మం డల కేంద్రానికి వెళ్లాలంటే వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. చేసేది లేక ప్రమాదం అ ని తెలిసిప్పటికీ తన కుమారుడిని చేతిలో పైకి ఎత్తి పట్టుకుని నిండుగా ప్రవహిస్తున్న వాగుదాటుతూ మండల కేంద్రానికి చేరుకుని చికిత్స అందించారు. అలాగే మరో వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయ పడగా అతనిడికి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించే క్రమంలో గ్రామంలోని యువకులు అతడిని మంచంపై పడుకోబెట్టి వాగు దాటించారు.

**వాగు అవతలి వైపు ఉన్న...**
లక్మాపూర్, అనార్‌పల్లి గ్రామాల సమీపంలో వాగు అవతలి వైపు ఉన్న కరంజీవాడ, పెద్ద కరంజీవాడ, జన్నాపూర్, బోరిలాల్‌గూడ, అంద్‌గూడ, శంకర్‌లొద్ది తదితర గ్రామాల ప్రజలు ప్రతి నిత్యం వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి రాక పోకలు సాగిస్తారు. అలాగే ఆదివారం జరిగే వార సంతకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తారు. వీరందరికి వర్షాకాలం ఓ ఆపద కాలం ఉన్నటుండి వర్షాలు కురిస్తే వస్తులుండాల్సిందే. ఏదైనా అత్యవసరమైతే ప్రాణాలను పనంగా పెట్టి వాగు దాటాల్సిందే. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారినా తమ కష్టాలు మాత్రం తీరడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


**సాంగ్వీ, కేలి(బి) గ్రామాల మధ్య..**
మండలంలోని సాంగ్వీ, కేలి(బి) గ్రామాల మధ్య లోలెవల్ వంతెనలు ఉండడంతో వంతెన అవతలి వైపున ఉన్న కేలి(బి), కేలి(కె), పర్సువాడ, గౌరి, లెండిగూడ, భోలాపటార్‌తో పాటు ఇందిరానగర్, కైరి, ఆగర్‌వాడ, ఇందాపూర్‌తో పాటు మహారాష్ట్రలోని జీవితి గ్రామాల ప్రజలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా తొలి విడుతలో ఎన్నికలు నిర్వహించే గ్రామాల్లో ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. మరోవైపు మూడో విడుత ఎన్నికలు నిర్వహించే గ్రామాల్లో నామినేషన్ల ఉపసంహరణ కూడా పూర్తయ్యింది. దీంతో గ్రామాల్లో ఎలక్షన్ల హీట్ పెరిగింది. తొలి విడుత ప్రచారం ముగిసిన నేపథ్యంలో అన్ని పార్టీల నాయకులు తమ మద్దతుదారులు పోటీ చేసే రెండో విడుత ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. పోటీలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం గురువారం తేలిపోనుంది.** మొదటి విడుతకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 506 గ్రామాలు, 4,222 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేశారు. ఇందులో కొన్ని స్థానాలు ఏకగ్రీవం కావడం, మరికొన్ని స్థానాల్లో అసలు నామినేషన్లు పడకపోవడంతో వాటిని మినహాయించి మిగిలిన స్థానాలకు రేపు(డిసెంబర్ 11న) ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ 24 గంటలే వారికి కీలకం కానున్నాయి. ఇప్పటిదాకా బాగుందన్న వారి భవిష్యత్తు తలకిందులు కావచ్చు. అంచనాలు లేకుండానే అనామకులు తెరపైకి దూసుకురావచ్చు. చివరి క్షణంలో ఏదైనా జరగొచ్చు. గురువారం 11న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కించి, సాయంత్రం వరకు ఫలితాలు వెల్లడిస్తారు.

# తొలి విడతకు తెర..

# పంచింగ్ స్పాట్లు




- ■ వారం రోజులుగా హోరాహోరీగా ప్రచారం
- ■ ముగిసిన గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల ప్రచారం
- ■ ఉమ్మడి జిల్లాలో పూర్తయిన మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ గడువు
- ■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 506 గ్రామాలు, 4,222 వార్డుల్లో ఎన్నికలు
- ■ సర్వం సిద్ధం చేసిన అధికారులు..
- ■ నేడు మండల కేంద్రాల్లో సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేయనున్న అధికారులు
- ■ ప్రలోభాలకు తెరలేపిన అభ్యర్థులు
- ■ రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా తొలి విడుతలో ఎన్నికలు నిర్వహించే గ్రామాల్లో ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. మరోవైపు మూడో విడుత ఎన్నికలు నిర్వహించే గ్రామాల్లో నామినేషన్ల ఉపసంహరణ కూడా పూర్తయ్యింది. దీంతో గ్రామాల్లో ఎలక్షన్ల హీట్ పెరిగింది. తొలి విడుత ప్రచారం ముగిసిన నేపథ్యంలో అన్ని పార్టీల నాయకులు తమ మద్దతుదారులు పోటీ చేసే రెండో విడుత ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. మొదటి విడుతకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 506 గ్రామాలు, 4, 222 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేశారు. ఇందులో కొన్ని స్థానాలు ఏకగ్రీవం కావడం, మరి కొన్ని స్థానాల్లో అసలు నామినేషన్లు పడకపోవడంతో వాటిని మినహాయించి మిగిలిన స్థానాలకు రేపు(డిసెంబర్ 11న) ఎన్నికలు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్‌కు కేవలం ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉంది. దీంతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు గ్రామాల్లో ప్రయత్నాలు మొదలయ్యాయి. ఎన్నికలకు ముందు రోజైన బుధవారం అభ్యర్థులకు కీలకంగా మారింది. ఓటర్లకు ఎలాగైనా డబ్బులు చేరేలా కొందరు అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వార్డు మెంబర్లు/సర్పంచ్ అభ్యర్థులు ఎవరికి వారు ఓటర్లకు ప్రసన్నం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రత్యర్థులు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారని నిఘా పెట్టి అవతలి వాళ్లు ఏం ఇచ్చారు. మేము ఏం ఇవ్వాలంటూ ఓటర్లకు ఆఫర్లు ఇస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా డబ్బులు పంచేందుకు.. ఎలాగైనా సరే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సిద్ధమయ్యారు. దీనికి అధికారులు ఎంత వరకు అడ్డుకట్ట వేస్తారన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. మంచిర్యాల జిల్లాలో తొలి విడుతలో 90 గ్రామ పంచాయతీల ఎన్నికలు ఉండగా ఆరు చోట్ల ఏకగ్రీవం అయ్యారు. మరో మూడు చోట్ల నామినేషన్లు పడలేదు. దీంతో మిగిలిన 81 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 258 మంది సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. ఇక 816 వార్డులకు 34 చోట్ల నామినేషన్లు దాఖలు కాలేదు. 268 వార్డుల్లో ఏకగ్రీవం కాగా మిగిలిన 514 వార్డుల్లో 1476 మంది బరిలో నిలిచారు. నిర్మల్ జిల్లాలో తొలి విడుతలో 136 సర్పంచ్ స్థానాలకు 16 గ్రామాలు ఏకగ్రీవం అయ్యాయి. ఒక గ్రామంలో నామినేషన్ రాలేదు. మిగిలిన 125 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించనుండగా సర్పంచ్‌లుగా 459 మంది పోటీ చేస్తున్నారు. మొత్తం 1072 వార్డు మెంబర్ స్థానాల్లో ఏడు చోట్ల నామినేషన్ పడలేదు. 474 వార్డుల్లో ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 594 వార్డుల్లో ఎన్నికలకు వెళ్తుండగా 1373 బరిలో ఉన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో 114 సర్పంచ్ స్థానాలకు ఏడు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 107 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనుండగా 396 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 944 వార్డుల్లో 579 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 368 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనుండగా 1424 మంది బరిలో ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల భవితవ్యం గురువారం తేలిపోనుంది. ఈ 24 గంటలే వారికి కీలకం కానున్నాయి. ఇప్పటి దాకా బాగుందన్న వారి భవిష్యత్తు తలకిందులు కావచ్చు. అంచనాలు లేకుండానే అనామకులు తెరపైకి దూసుకురావచ్చు. చివరి క్షణంలో ఏదైనా జరగొచ్చు. గురువారం 11న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కించి, సాయంత్రం వరకు ఫలితాలు వెల్లడిస్తారు.

**అప్రమత్తంగా లేకపోతే అంతే...**

చాలాచోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరు ముగ్గురు పోటీపడుతుండగా, కొన్నిచోట్ల బీఆర్ఎస్‌కు చెందిన అభ్యర్థులు ఇద్దరు చొప్పున పోటీ పడుతున్నారు. మరికొన్ని చోట్ల కులాలకు సంబంధించి వాళ్లు ఎక్కువ మంది పోటీ చేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు పోటీ చేయడం వల్ల ఓట్లు చీల్చుకుని ప్రత్యర్థులకు మేలు జరుగుతుంది. ఈ నేపథ్యంలో పార్టీలు, కుల పెద్దలు జోక్యం చేసుకుని పోటీలో ఉన్న మిగతా అభ్యర్థులు విరమించుకుని, ఒక్కరికే మద్దతిచ్చేలా చూస్తారు. ఇందులో ఎవరికి వారుగా ఇలానే రేపటి వరకు పోటీలో ఉంటే తన విజయం ఖాయమని భావిస్తున్నారు. పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులు తప్పుకుని, మరో అభ్యర్థికి మద్దతిస్తే మాత్రం ఫలితం మరోలా ఉండనుంది.

**ప్రలోభాలతో తారుమారు...**

ఓటర్ల మద్దతు కోసం అభ్యర్థులు రకరకాల ప్రలోభాలకు గురిచేస్తున్నారు. డబ్బులున్నవాళ్లు మద్యంతోపాటు, నగదు పంపిణీ చేసి కొంత శాతం ఓట్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఒక్కో గ్రామంలో 50-100 ఓట్లను ప్రభావితం చేసినా ఫలితాలు తారుమారు కానున్నాయి. మద్యం, నగదుతోపాటు చీరలు, బహుమతులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గుర్తులను గుర్తించుకోవడానికి బ్యాట్, లేడీస్ హ్యాండ్ పర్సు గుర్తులు పంపిణీ చేస్తున్నారు.

**మద్యం కొరతతో తికమక...**

ఎన్నికల్లో ఎక్కువగా సేల్ అయ్యే మద్యంపై బేవరీస్ రేషన్ విధించింది. దీంతో ఆయా బ్రాండ్ల లిక్కర్లు రోజూ ఒక్కో దుకాణానికి 3-4 కాటన్ల మద్యం మాత్రమే పంపిణీ అవుతోంది. దాంతో ఫలానా బ్రాండ్ కావాలని అడ్వాన్స్ ఇచ్చిన వ్యాపారులు పోటీదారులకు మద్యం పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రచారం ముగియడంతో ఎన్నికలు జరగనున్న మండలాల్లో మద్యం దుకాణాలు మంగళవారం సాయంత్రం 5గంటల నుంచే మూతపడ్డాయి. వీటిని ఈనెల 11న సాయంత్రం తరువాత తెరువనున్నారు.

## ఎన్నికల నిర్వహణలో
## భద్రతా సమస్యలు రావొద్దు

- ■ ఎన్నికల నిర్వహణలో భద్రతా సమస్యలు రావొద్దు
- ■ ఎన్నికల వేళ.. అభ్యర్థులకు హెచ్చరిక!
- ■ అభ్యర్థులు ప్రజలకు డబ్బులిచ్చినా, బెదిరించినా నేరమే
- ■ జైలు శిక్షతో పాటు జరిమానాలు తప్పవు

**ముథోల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**

ఓటు అనేది వజ్రాయుధం వంటిది. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి అద్దం పడతాయి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలాగైనా గెలవాలని రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ప్రధానంగా ఓటర్లకు డబ్బు, మద్యం పంచడం, బెదిరింపులకు పాల్పడటంతో పాటు ఎదుటి వ్యక్తిపై తప్పుడు ప్రచారం చేయడం వంటి ప్రలోభాలకు పాల్పడుతుంటారు. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల వేళ పల్లెల్లో రకరకాల ప్రలోభాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నికల వేళ ఇటువంటి ప్రలోభాలకు పాల్పడితే భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)- 2023 యాక్ట్ ప్రకారం పలు శిక్షలతో పాటు జరిమానా కూడా విధిస్తారు. ఎన్నికల వేళ ఎవరైనా నేరాలకు పాల్పడితే కేసు నమోదు చేస్తారు. నేరం నిరూపణ అయితే శిక్షలు విధిస్తారు.

**డబ్బుతో ప్రలోభ పెట్టడం..**

ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు.. ఓటర్లకు డబ్బులు ఆశ చూపడం, మద్యం బాటిళ్లు ఇవ్వడంతో పాటు వస్త్రాలు, బహుమతులు ఇచ్చి ఓటు అడగటం నేరం. ఎన్నికల సమయంలో ఇటువంటివి జరుగుతున్నట్లు ఎన్నికల అధికారుల దృష్టికి వచ్చినపుడు విచారణ చేపడతారు. ఒకవేళ నేరం రుజువు అయితే సెక్షన్ 171బీ కింద ఏడాది పాటు జైలు, జరిమానా విధిస్తారు. అభ్యర్థులతో పాటు ఓటు కోసం డబ్బులు తీసుకున్న వారికీ శిక్ష విధించవచ్చు. ఎన్నికల సమయంలో అభ్యర్థుల తరుపున ఎవరైనా ఇలాంటి వాటికి పాల్పడితే చర్యలు తప్పవు.

**తప్పుడు ప్రచారం చేసినా..**

బరిలో నిలిచిన అభ్యర్థులపై కొందరు దుష్ప్రచారాలు చేస్తుంటారు. ఫలితాలను ప్రభావితం చేసేలా ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి వ్యక్తిత్వం గురించి ప్రచారాలు చేస్తుంటారు. అభ్యర్థికి వివాహేతర సంబంధాలు ఉన్నాయని, స్మగ్లర్ అని, నేరాలు చేశాడని, మంచివాడు కాదని ప్రచారాలు చేస్తుంటారు. ఇలా ప్రచారాలు చేయడం కూడా నేరంగానే పరిగణిస్తారు.

**దొంగ ఓట్లు వేయటం..**

పోలింగ్ వేళ చనిపోయిన వారి పేరు మీద దొంగ ఓట్లు వేయాలని కొందరు ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు మారు పేరుతో ఓటు వేయడం, ఒకసారి ఓటు వేసినా మరోసారి ఓటు వేయాలని ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు దొంగ ఓట్లను వేసేలా ఇతరులను ప్రోత్సహించటం కూడా చేస్తుంటారు. ఇవి కూడా ఎన్నికల వేళ తీవ్ర నేరాలుగా పరిగణిస్తారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారికి ఏడాది పాటు జైలుశిక్ష ఉంటుంది.

**బెదిరింపులు, ఒత్తిడి చేయడం..**

అభ్యర్థులు వారికి అనుకూలంగా ఓటు వేయాలని ఓటర్లను బెదిరిస్తుంటారు. వారిపై ఒత్తిడి తెస్తుంటారు. 171సీ కింద కేసు నమోదు చేసి విచారణ చేపడతారు. ఇది నిరూపణ అయితే ఏడాది జైలు శిక్ష పడే ఆవకాశం ఉంది.



### విశ్రాంత ఉద్యోగుల జిల్లా

## నూతన కార్యవర్గం ఎన్నిక

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం రాత్రి ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దూస కృష్ణ, బెజ్జంకి జగన్, కోశాధికారిగా పి.పాపారావు, సహ అధ్యక్షులుగా కే నాగేశ్వర్, ఉపాధ్యక్షులుగా బీ సత్యనారాయణ, బీ రాజమౌళి, కె సంపూర్ణ, కార్యదర్శులుగా శంకర్ గౌడ్, కే వైకుంఠం, సంయుక్త కార్యదర్శులుగా ప్రేమ్ రావు, కే మల్లయ్య, కార్య నిర్వాహక కార్యదర్శులుగా పి.తిరుపతి, జె. కైలాసం, పి.సత్తమ్మ, బళ్ళ శంకర్లింగం, గుండేటి యోగేశ్వర్‌లు ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసి రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలని కోరారు.

## కలప దుంగలు స్వాధీనం



**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని దేవునిగూడలో అక్రమంగా నిలువ ఉంచిన కలపను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఇంధన్‌పల్లి రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్ సిబ్బందితో కలిసి వెళ్లి దేవునిగూడ గ్రామానికి చెందిన గవ్వల మురళి ఇంట్లో తనిఖీ చేయగా అక్రమంగా నిలువ ఉంచిన 8 టేకు దుంగలు లభ్యమైనట్లు తెలిపారు. కర్రతో పాటు కోత మిషన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కలప విలువ రూ.30 వేల వరకు ఉంటుందన్నారు. నిందితుడు మురళిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో డీఆర్వో కుమార స్వామి, సెక్షన్ అధికారులు రవి, మధుకర్, పురు షోత్తం, ఎఫ్‌బీవోలు తన్వీర్ పాషా, లవన్, తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**



జిల్లా కేంద్రంలోని ఏసీసీ ఫ్యాక్టరీ వెనుకాల ఈ నెల 8న రాత్రి రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ జస్వాల్ సింగ్ మంగళవారం తెలిపారు. హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన సాగే శ్రీనివాస్ (35) మంచిర్యాలలో ఇంటర్ నెట్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పెళ్లయి 14 సంవత్సరాలు కావస్తున్నా సంతానం కలుగడంలేదని రోజూ బాధపడుతుండేవాడు. సోమవారం రాత్రి బల్లార్షా నుంచి మంచిర్యాల వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య సరిత ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



**ఖానాపూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పని చేస్తోందని అధికార పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా అని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పలు గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం మండలంలోని బాధనకుర్తి, సింగపూర్, రాజు, చందునాయక్ తండా, గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చాక ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే అన్నారు. గత బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి పేదవారికి రేషన్ కార్డులు ఇవ్వలేకపోయిందని కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పేద ప్రజలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని అన్నారు. అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల తప్పుడు మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించండి మరిన్ని సంక్షేమ పథకాలు చేపడతామని తెలిపారు. అధికార పార్టీ అభ్యర్థులు గెలిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థులు రవీందర్, బిక్సింగ్, రాజన్న, వార్డ్ అభ్యర్థులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం, నిమ్మల రమేష్, నిమ్మా, షబ్బీర్ పాషా, కిషోర్, నర్సయ్య పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి గెలుపుతోనే అభివృద్ధి

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

**జన్నారం, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపిస్తే మేజర్ గ్రామ పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండల కేంద్రంలోని పొన్కల్ జీపీ పరిధిలోని వారసంతలో మంగళవారం సర్పంచ్ అభ్యర్థి జక్కు సుష్మా, మాజీ సర్పంచ్ జక్కు భూమేశ్‌తో కలిసి ప్రచారం చేశారు. పొన్కల్‌లో డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళన చేస్తానని హామీ ఇచ్చారు. అధికార పార్టీ అండగా ఉన్న జక్కు సుష్మాను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డుల జారీ,



ఆరోగ్య శ్రీ వంటి పథకాలే కాకుండా అభివృద్ధి పూచి నాది అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసీఉల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మాజీ సర్పంచ్ జక్కు భూమేశ్, నాయకులు రాగుల శంకర్, ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నేపథ్యంలో వారసంత బంద్ పాటించాలి

**జైనూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**



11న పంచాయతీ ఎన్నికల కారణంగా జైనూర్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించే వారపు సంతను బంద్ పాటించాలని జైనూర్ తాసిల్దార్ ఆడ బిర్షావ్ కోరారు. గురువారం వారపు సంత మార్కెట్ పూర్తిగా బంద్ చేయించాలని ఎన్నికల కోడ్ని ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని వ్యాపారులు దూర ప్రాంతం నుండి వచ్చే వ్యాపారులు వార సంతకు రావద్దని ఆయన కోరారు.

## తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియా గాంధీ



### డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్

**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న త్యాగశీలి, తెలంగాణ తల్లి సోనియా గాంధీ అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. సోనియా గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డీసీసీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అద్యక్షుడు, ఇతర నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి సంబరాలు జరుపుఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి వెనుక ఉన్న అసలు శక్తి సోనియా గాంధీ అని పేర్కొన్నారు. ఆమె ఒక నాయకురాలు మాత్రమే కాదని, దూరదృష్టి, ధైర్యం, త్యాగం, ప్రజల పట్ల మమకారం కలిగిన నిజమైన మాతృమూర్తి అని అన్నారు. ప్రజలు కోరిన మేరకు ఎంతటి రాజకీయ ఒత్తిడులు వచ్చినా, ఎంతటి విమర్శలు ఎదురైనా చివరికి తెలంగాణ ప్రజల భావోద్వేగాలను గౌరవించి ఆమె తీసుకున్న నిర్ణయం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. సోనియా గాంధీ ఎప్పుడూ బలహీన వర్గాలు, మహిళలు, యువత, రైతులు, కార్మికుల కోసం పనిచేసే విధానాన్ని అవలబిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సోయం బాపురావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజరెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, జిల్లా మాజీ అధ్యక్షులు సాజిత్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు మల్లేష్, సంతోష్, నర్సింగ్, అనిల్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా...**
తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జీ కూచాడి శ్రీహరి రావు అన్నారు. మామడ మండలం పొన్కల్ గ్రామంలో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. 60 ఏళ్ళ తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన త్యాగశీలి సోనియా అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శోభ నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీమ్ రెడ్డి, గంగారెడ్డి, నర్సారెడ్డి సెల్కం శేఖర్ కొట్ట శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**బేల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
బేల శ్రీ దుర్గ వైన్స్‌లో జరిగిన దొంగతనం కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. చోరీకి పాల్పడిన టెకం జోష్న, షిండే అజయ్‌లు డబ్బులు పంచుకుంటుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుండి నగదు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామ సరిహద్దులో డబ్బులు, మద్యం పంచుకుంటుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు.

### ఉద్యోగాల ఇప్పిస్తానని..

## మోసం చేసిన మహిళ అరెస్టు

**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ఉద్యోగాల పేరిట మోసం చేసిన మహిళను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం వన్ టౌన్‌లో వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని కోలిపుర కాలనీకి చెందిన తన్నీరు హేమావతి అమేజాన్ కంపెనీలో చాట్ ప్రాసెసర్ ఉద్యోగాలు ఉన్నాయని పట్టణానికి చెందిన కుర్మిల్ల ప్రకాశితను నమ్మించింది. ఆమె స్నేహితులైన సాహితి, లత ఉద్యోగం కోసం హేమావతికి రూ.2.25 లక్షలు విడతల వారీగా చెల్లించారు. ఉద్యోగం ఇప్పించకపోగా ఇచ్చిన డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితురాలు గత నెల 28న ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం నిందితురాలిని అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

## రెండు పులుల సంచారం

### పాదముద్రలు సేకరించిన అటవీ అధికారులు

**జైపూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జైపూర్ అటవీ ప్రాంత పరిసరాల్లో రెండు పులులు సంచరిస్తున్నట్లు అటవీ సెక్షన్ అధికారి రామకృష్ణ సర్కార్ మంగళవారం తెలిపారు. వాటి పాదముద్రలు గుర్తించినట్లు పేర్కొన్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని అటవీ పరిసర ప్రాంతాలను ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పారు. రైతులు పత్తి చేన్లకు, పశువుల కాపర్లు ఒంటరిగా అటవీ ప్రాంతం వైపు వెళ్లవద్దని తెలిపారు. హైవే రోడ్డుకు ఆనుకుని ఉన్న ఒక మామిడితోటలో, వేలాల ఇసుక క్వారీ వద్ద పెద్దపులి పాదముద్రలు గుర్తించామని చెప్పారు. పులి కనిపిస్తే అటవీశాఖ అధికారులకు తెలుపాలని, దానికి హాని తలపెట్టవద్దని సూచించారు. పులి కదలికలపై నిఘా పెంచామని, ఇందుకోసం ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని తెలిపారు. ట్రాక్ కెమెరాలు, మానవ వనరుల ద్వారా పులి కదలికలను గమనిస్తున్నామని, పులిని రక్షించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



# తెలంగాణ సంస్కృతికి నిదర్శనం తెలంగాణ తల్లి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ సంస్కృతికి నిదర్శనం తెలంగాణ తల్లి అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో డీసీపీభాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, మండల అధికారి శ్రీనివాస్ రావు, ఇతర జిల్లా అధికారులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డకు ప్రత్యేకమైన స్థానం ఉంటుందని, మహిళను ఇంటి దేవతగా అభిమానిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో కుటుంబంలో కొడుకు, కూతుళ్లలో ఆడబిడ్డకు ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక వ్యాపార రంగాలలో మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని, ఈ సంస్కృతిని భావితరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో గోదావరి పరిక్రమన యాత్ర





- బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో 400 మంది సాధువుల ప్రత్యేక పూజలు
- గోదావరిలో సాధువుల పుణ్యస్నానాలు..
- పట్టణంలో బైక్ ర్యాలీతో భారీ శోభయాత్ర
- తరలివచ్చిన వందలాది మంది భక్తులు..

**ముథోల్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా త్రయంబకేశ్వర్ గోదావరి నది జన్మస్థలం నుంచి 400 మంది సాధువులు ప్రారంభించిన గోదావరి పరిక్రమన (ప్రదక్షిణ) యాత్ర మంగళవారం నిర్మల్ జిల్లాకు చేరుకుంది. ముందుగా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి వచ్చిన సాధువులకు ఆలయ వైదిక బృందం, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బాసర సరస్వతి అమ్మవారికి, భైంసా రూరల్ మండలం మాటేగాం గ్రామంలో కొరడి గణపతికి రాజేంద్రదాస్ మహారాజ్, భాగేశ్వర్ థామ్ సర్కార్ మహారాజ్, సద్గురు శిల్లింగ్ మహారాజ్, కేదారేశ్వర పలుగుట్ట రాములు మహారాజ్ ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 400మంది సాధువులు, మహాపీఠాధి పతులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి అమ్మవారి హారతి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గోదావరి నది ఒడ్డున ఉన్న దేవాలయాలు, ప్రకృతి అందాలనుదర్శిస్తూ సంపూర్ణమైన ఆధ్యాత్మిక యాత్ర చేపట్టినట్లు రాజేంద్రదాస్ తెలిపారు. అనంతరం భైంసా, నిర్మల్, ఖానాపూర్ పట్టణం మీదుగా 50 వాహనాల్లో సాధువులు యాత్రగా వెళ్లారు. నిర్మల్ ఈద్గాం చౌరస్తా వద్ద పలు పాఠశాలాల విద్యార్థులు, ఆధ్యాత్మిక సంఘాలు, భక్తులు, వ్యాపారులు, కుల, ఉద్యోగ సంఘ నాయకులు స్వాగతం పలికారు. సాధువుల ఆశీర్వచనం పొందారు. బైక్ ర్యాలీతో శోభయాత్రగా కొండాపూర్ వరకు వెళ్లారు. కార్యక్రమాన్ని అరుణ్ శర్మ ముందుకు తీసుకెళ్లారు. సాధువులు, మహాపీఠాధి పతుల రాకతో పట్టణం ఆధ్యాత్మిక శోభసంతరించుకుంది.



# 'విశ్వ' పఠాన్ జమీల్ ఖాన్

**టోరంటోలో మెరిసిన మందమర్రి ముద్దుబిడ్డ**

**అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం**

**మంచిర్యాల, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
కెనడాలోని టోరంటోలో ఈ నెల నాలుగు నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన డాక్టర్ పఠాన్ జమీల్ ఖాన్ బంగారు పతకం సాధించారు. ప్రపంచ వ్యాప్తంగా 30 దేశాల నుంచి 2000 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో భారత్ తరఫున 50 ఏండ్ల విభాగంలో పోటీలో పాల్గొని బంగారు పతకం సాధించారు. జమీల్ ఖాన్‌ను జిల్లా ప్రజలు, మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు అభినందించారు.

# ముగిసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

**ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టు**

**ఆదిలాబాద్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రం సమీపంలోని ఓక్లే ఇంటర్నేషనల్ పాఠశాలలో సోమవారం ప్రారంభమైన 10వ వింటర్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా హైదరాబాద్ జిల్లా జట్టు నిలిచింది. విజేతలకు డీటీఎస్‌వో పార్థసారథి, స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమేష్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీటీఎస్‌వో మాట్లాడుతూ జిల్లాలో స్విమ్మింగ్ క్రీడాభివృద్ధికి అసోసియేషన్ ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 28 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో స్విమ్మర్లు రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిని రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము కృష్ణ, డాక్టర్ క్రాంతి కుమార్, ఆదిత్య ఖండేశ్కర్, బారే శ్రీధర్ రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. గ్రూప్-1 బాలుర విభాగంలో బగ్గు గౌతమ్ శశివర్ధన్ నాయుడు 3 స్వర్ణాలు, 2 రజతాలు, గ్రూప్-2లో ఎస్ఎస్. సచిన్ సాత్విక్ 5 స్వర్ణాలు, గ్రూప్-3లో అర్జున్ కాస్వన్ 5 స్వర్ణాలు, గ్రూప్ 4 విభాగంలో 2 స్వర్ణాలు సాధించారు. బాలికల్లో గ్రూప్-1 విభాగంలో హర్షిత వర్మ 4 స్వర్ణాలు ఒక రజతం, గ్రూప్-2లో శివాని కర్ర 5 స్వర్ణ, గ్రూప్-3 విభాగంలో సంయుక్త 3 స్వర్ణాలు, ఒక రజతం, గ్రూప్-4 విభాగంలో అడ్డూరి జాగృతి శ్రీనివాస రావు 2 స్వర్ణ పతకాలు సాధించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొమ్ము చరణ్ తేజ్ 400 మీటర్ల ఐఎం ఈవెంట్‌లో అనిరుధ్ 50 మీటర్ల బెస్ట్ స్ట్రోక్ ఈవెంట్లో కాంస్య పతకాలతో మెరిసారు. మొత్తంగా హైదరాబాద్ జిల్లా జట్టు మొత్తం 51 స్వర్ణాలు, 45 రజతాలు, 23 కాంస్య పతకాలతో 266 పాయింట్లతో ఓవరాల్ చాంపి యన్షిప్, ద్వితీయస్థానంలో నిలిచిన రంగారెడ్డి 245 పాయింట్లతో 40 స్వర్ణాలు, 41 రజతాలు, 43 కాంస్య పతకాలు సాధించింది. తృతీయస్థానంలో కరీంనగర్, నాలుగో స్థానంలో ఆదిలాబాద్ జట్టు నిలిచాయి.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# ఐటీడీఏ పల్స్ యాప్ ద్వారా నిరంతర పర్యవేక్షణ

**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్**



**ఉట్నూర్, డిసెంబర్ 9 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఏ) పరిధిలో గల ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీమ్-ఆసిఫాబాద్ జిల్లాలలో ఉన్న గిరిజన పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఐటిడిఏ పల్స్ యాప్ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని ఉట్నూర్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు అందించే కామన్ డైట్ మెనూను సక్రమంగా అమలు చేయడాన్ని పర్యవేక్షించేందుకు ఈ యాప్‌ను ప్రవేశపెట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ యాప్ ద్వారా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు ప్రతి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనాల ఫోటోలను అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు యాప్‌ను సమర్థంగా వినియోగిస్తూ ఫోటోలు, వివరాలు తరచూ అప్లోడ్ అవుతున్నాయని, ఈ వివరాలను ఐటిడిఏ కార్యాలయం రోజువారీగా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. యాప్ వినియోగంలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఆహార నాణ్యత, పరిశుభ్రతను నిర్ధారించేందుకు అప్‌లోడ్ చేసిన ఫోటోలను ప్రాజెక్టు అధికారి పేషి రోజువారీగా పరిశీలిస్తోందని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారుల ద్వారా అప్‌లోడ్ చేసిన ఆహార అంశాలు, వాటి నాణ్యతను ఎ.ఐ. ఆధారంగా కూడా పరిశీలించే విధానం అమలులో ఉందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఈ వ్యవస్థను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ఐటిడిఏ సిద్ధమవుతోందని ప్రాజెక్టు అధికారి వెల్లడించారు.